VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 24.07.2026
సంపుటి : 09 సంచిక : 45 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



## నీట్ లీక్‌పై భగ్గుమన్న విపక్షాలు

- విద్యా వ్యవస్థను నాశనం చేశారన్న రాహుల్, ఖర్గే
- విద్యాశాఖ మంత్రిని వెంటనే బర్తరఫ్ చేయాలి

# రేపు మొకిలలో వానాకాలం అత్యవసర పంటల ప్రణాళికపై అవగాహన సదస్సు

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన
- చారిత్రక శాసనసభ భవనంలో పునరుద్ధరణ పనుల పరిశీలన
- మరమ్మతు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష
- ప్రాంగణమంతా తిరిగి పునరుద్ధరణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి
- మరమ్మతు పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశం
- శాసనసభ భవనం వారసత్వ వైభవాన్ని పరిరక్షించాలని సూచనలు
- పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు



**హైదరాబాద్, వెలుతురు జూలై 2026:**

చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో కొనసాగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. శాసనసభ ప్రాంగణమంతా తిరిగి జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించిన ఆయన.. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.భవనం చారిత్రక వైభవానికి ఎలాంటి భంగం కలగకుండా పునరుద్ధరణ పనులు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన శాసనసభ భవనం ప్రత్యేకతను కాపాడేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, జైవీర్ రెడ్డి తదితరులు ముఖ్యమంత్రితో కలిసి పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పనుల పురోగతిని వివరించారు.

# పేపర్ లీక్ విచారణ కోసం దేశవ్యాప్తంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

- నీట్ పేపర్ లీక్ కేసులో ప్రధాని నరేంద్రమోదీ కీలక నిర్ణయం
- పేపర్ లీక్ కేసుల విచారణ కోసం దేశవ్యాప్తంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని వదిలిపెట్టబోమన్న ప్రధాని
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్‌తో దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న ఆందోళనలు
- జంతర్‌మంతర్ నుంచి మొదలైన సీజేపీ నిరసనలకు విపక్షాల మద్దతు



# ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

- యూనిఫాంల నాణ్యతపై రాజీపడేది లేదు..
- పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి పెంచాలి
- యూనిఫాం సరఫరాపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**

యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు.

# ఓటరు సవరణ ప్రక్రియ లో ఎన్యునరేషన్ ఫారాన్ని నింపి బి ఎల్ వో కి అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్



- హుస్నాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ ఓటరు సవరణ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదాం - మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్, వెలుతురు జూలై 23:**

హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఓటరు సవరణ (SIR) ప్రక్రియపై బిఎల్‌ఏ-2లు, బిఎల్‌ఏ సూపర్వైజర్లు, పార్టీ ముఖ్య నాయకులతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్‌వోకు అందజేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను సరిచూసుకొని ఎన్యూమరేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

▶ మిగతా 12లో

# రాష్ట్రంలో 70 శాతం ఎస్ఐఆర్ పూర్తి

- ఓట్ల తొలగింపునకు అవకాశం లేకుండా బీఎల్‌వోలను నియమించాం..
- రెండు ఓట్ల ఆరోపణలపై స్పందించిన ముఖ్యమంత్రి
- రాష్ట్రంలో ఇప్పటివరకు 70 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందన్న సీఎం
- ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించకుండా బీఎల్‌వోలను నియమించామని వెల్లడి
- నాకు రెండు ఓట్లు ఉన్నాయని ఆరోపిస్తున్నారు.. ఫిర్యాదు చేయమనండి: రేవంత్

రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ 70 శాతం పూర్తయిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు.

ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో అర్హులైన వారి ఓట్లు తొలగించే అవకాశం ఉందని భావించి, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) నియమించామని చెప్పారు. ఓటు లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై మాట్లాడారు.

▶ మిగతా 2లో

# నీట్ సహా అన్ని అంశాలపై చర్చకు సిద్ధం: ఎంపీ కె. లక్ష్మణ్

- పార్లమెంట్‌ను అడ్డుకోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోంది
- పార్లమెంట్‌ను సజావుగా సాగనివ్వడం లేదు
- నీట్ పేపర్ లీక్ కేసులో ఇప్పటికే 17 మందిని అరెస్టు చేశామని వెల్లడి
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్



# భాగ్యనగరంలో పేదలకు 'ఇందిరమ్మ టవర్స్'

- రూ. 60 లక్షల ఇల్లు కేవలం రూ. 6 లక్షలకే
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కీలక ప్రకటన
- హైదరాబాద్ పేదలకు సొంతింటి కల దిశగా అడుగులు
- కోట్ల విలువైన ప్రభుత్వ భూముల్లో నాణ్యమైన గృహాలు
- అధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష
- లబ్దిదారుల ఎంపికలో బలహీన వర్గాలకు పెద్దపీట



# ఖమ్మంలో తాగునీటి ఎద్దడికి చెక్

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఎల్ నినో తీవ్రతపై ప్రజా ప్రభుత్వ ముందస్తు వ్యూహం
- వైరా రిజర్వాయర్‌కు చేరుతున్న గోదావరి జలాలు
- వెంకటాయపాలెం వద్ద కాలువ ప్రవాహాల పరిశీలన



ఎల్ నినో తీవ్రత వల్ల రానున్న రోజుల్లో ఖమ్మం జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి తలెత్తకూడదనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వేసవిలో నీటి కొరత పరిస్థితులను ముందే ఊహించి, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

**వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలు**

ఈ రోజు వెంకటాయపాలెం సమీపంలో ఎన్‌ఎస్పీ ప్రధాన కాలువ మీదుగా వైరా రిజర్వాయర్‌కు వేగంగా చేరుతున్న గోదావరి జలాలను డిప్యూటీ సీఎం క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. దుమ్ముగూడెం (సీతారామ ఎత్తిపోతల పథకం) నుంచి రాజీవ్ లింక్ కాలువ ద్వారా మళ్లించిన నీరు జలాశయానికి చేరుతుండటం, ప్రవాహ వేగాన్ని అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్షించారు.

**యుద్ధప్రాతిపదికన చెరువుల నింపుదల**

గోదావరి నుంచి మళ్లించిన జలాలతో ఖమ్మం జిల్లాలోని ప్రధాన చెరువులు, నీటి వనరులు మరియు జలాశయాలను యుద్ధప్రాతిపదికన నింపాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి నీటి బొట్టునూ సమర్థవంతంగా సద్వినియోగం చేస్తూ, నీటి సరఫరాలో ఎక్కడా వ్యర్థాలు, ఆటంకాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

## జంతర్ మంతర్ ఆందోళనలు రాజకీయ ప్రేరేపితం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఆందోళనల వెనుక షాహిన్‌బాగ్ నిరసనకారులు ఉన్నారని అనుమానం
- నీట్ పేపర్ లీక్ నిందితుల అరెస్ట్.. చట్టం తెచ్చిన కేంద్రం



## కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

- సీఎం రేవంత్‌కు ఇప్పటికే నోటీసు
- కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పందంపై ప్రశ్నలు
- సీఎం రేవంత్ వైఖరిపై నిలదీత
- బీజేపీతో దోస్తీపై తీవ్రస్థాయి విమర్శలు
- లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని ప్రకటన



# ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయ సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్ఆర్డీలో గురువారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో రాజీపడమని సీఎం తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను

ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని సీఎం హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సీఎం సూచించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో అడ్డగోలుగా వ్యవహరించారని సీఎం అన్నారు. తాము వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని... నాణ్యమైన యూనిఫాంలు అందిస్తామని తెలిపారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామని అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. వచ్చే సంవత్సరం జూన్ 2వ తేదీ నాటికే విద్యార్థులకు యూనిఫాం అందేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు బాల మాయా దేవి, షఫీ ఉల్లా, విజయేంద్ర బోయి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## నీట్ లీక్‌పై భగ్గుమన్న విపక్షాలు

- కేంద్రం ముందు రాహుల్ గాంధీ 3 ప్రధాన డిమాండ్లు

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సాగిస్తున్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డాయి. మన దేశపు విద్యా వ్యవస్థను కేంద్రం పూర్తిగా నాశనం చేయడమే కాకుండా, అక్రమాలకు పాల్పడిన దోషులను స్వయంగా ప్రభుత్వమే కాపాడుతోందని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువత భవిష్యత్తును ప్రస్తుత ప్రభుత్వం అత్యంత దారుణంగా దెబ్బతీసిందని తీవ్రంగా ధ్వజమెత్తారు.ఈ సంక్షోభ పరిణామాలపై విద్యార్థుల తరపున రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వం ముందు మూడు స్పష్టమైన డిమాండ్లను ఉంచారు. మొదటిది నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలి. రెండవది జరిగిన పరిణామాలపై, నష్టపోయిన విద్యార్థులకు ప్రభుత్వం బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. మూడవది జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అమాయక విద్యార్థులపై దాడులకు, లాఠీఛార్జికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశంలో విద్యా వ్యవస్థ పూర్తిగా క్షీణించిపోయిందని విమర్శించారు. తమ హక్కులు, పారదర్శక పరీక్షల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువత పట్ల పోలీసులు, ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా, అత్యంత క్రూరంగా ప్రవర్తించాయని దుయ్యబట్టారు. విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం ద్వారా ప్రభుత్వం తమ అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఖర్గే ఆరోపించారు.కేంద్ర పాలకులు తమ ఏసీ గదుల్లోంచి బయటకు వచ్చి, నియంతృత్వానికి వ్యతిరేకంగా వీధుల్లో రక్తం చిందించిన యువతీ యువకుల కళ్లలోకి నేరుగా చూడాలని ఖర్గే హితవు పలికారు. విద్యార్థులు కోరుతోంది కేవలం విఫలమైన విద్యాశాఖ మంత్రి తొలగింపు మరియు పారదర్శకమైన పరీక్షల నిర్వహణ మాత్రమేనని చెప్పారు. దేశంలో విద్యా వ్యవస్థను ఆర్ఎస్ఎస్ (RSS) పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుందని, ఫలితంగా విద్యా ప్రమాణాలు పడిపోయి నిరుద్యోగం ఆ కాశాన ్నంటుతోంద ని మండిపడ్డారు. ఉపాధి పేరిట కాంట్రాక్టు పద్ధతిని పరాకాష్టకు తీసుకెళ్లారని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సంచలన పోస్ట్ చేశారు. నీట్ పేపర్ లీకేజీపై రాహుల్ గాంధీ లేవనెత్తిన సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక



కేంద్ర ప్రభుత్వం తీవ్ర భయానికి గురవుతోందని వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలను తిప్పికొట్టేందుకు కేంద్ర మంత్రి జేపీ నడ్డా హుటాహుటిన మీడియా సమావేశం ఏర్పాటు చేశారని, అయితే ఆ ప్రెస్ మీట్ అంతా కేవలం గత ప్రభుత్వాల తప్పులను ఎత్తిచూపడానికే సరిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత సమస్యకు సరైన సమాధానం చెప్పలేకపోవడం ప్రభుత్వ భయానికి నిదర్శనమన్నారు.మోదీ ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకొచ్చిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఒక విఫల వ్యవస్థగా మారిందని జైరాం రమేశ్ ఆరోపించారు. ఎన్టీఏ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు కనీసం 9 సార్లు వేర్వేరు పోటీ పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయని గుర్తుచేశారు. తాజాగా నీట్ పరీక్షలోనూ భారీ అక్రమాలు వెలుగు చూశాయన్నారు. ఎన్టీఏ సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన డాక్టర్ కె. రాధాకృష్ణన్ కమిటీ ఏకంగా 101 కీలక సిఫార్సులతో నివేదిక సమర్పించినప్పటికీ, ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆయన దుయ్యబట్టారు.దేశ రాజధాని దిల్లీలో న్యాయబద్ధంగా, శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడాన్ని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు.నీట్ పేపర్ లీక్ ఘటన మరియు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో విపక్షాలు తమ నిరసన సెగను పార్లమెంట్‌కు సైతం వ్యాపింపజేశాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష ఎంపీలు భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్లకార్డులు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ స్వయంగా పాల్గొని విద్యార్థుల పోరాటానికి తమ మద్దతు తెలిపారు.

# ఖమ్మంలో తాగునీటి ఎద్దడికి చెక్

(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు ప్రణాళికతో జిల్లాలోని ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటమే మన ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, జిల్లావ్యాప్తంగా తాగునీటి నిల్వలను సమ సమర్థంగా నిర్వహించాలని నీటిపారుదల మరియు సంబంధిత శాఖల అధికారులకు భట్టి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

# నీట్ సహా అన్ని అంశాలపై చర్చకు సిద్ధం: ఎంపీ కె. లక్ష్మణ్

- పార్లమెంట్‌ను అడ్డుకోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోంది
- పార్లమెంట్‌ను సజావుగా సాగనివ్వడం లేదు
- నీట్ పేపర్ లీక్ కేసులో ఇప్పటికే 17 మందిని అరెస్టు చేశామని వెల్లడి
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

పార్లమెంట్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌తో పాటు అన్ని ప్రజా ప్రాధాన్య అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్లమెంట్‌ను సజావుగా సాగనివ్వకుండా ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

పార్లమెంట్ సమావేశాలను పదేపదే అడ్డుకోవడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రజలకు సంబంధించిన కీలక అంశాలపై సభలో చర్చలు జరగకుండా అడ్డుకోవడం సరికాదన్నారు.

నీట్ పేపర్ లీక్ కేసులో ఇప్పటికే 17 మందిని అరెస్టు చేశారని కె. లక్ష్మణ్ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా కేసుల విచారణ చేపట్టి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# పేపర్ లీక్ విచారణ కోసం దేశవ్యాప్తంగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్ష పత్రాల లీకేజీలకు పాల్పడిన వారిపై వేగంగా విచారణ జరిపి కఠిన శిక్షలు విధించేలా ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ గురువారం ప్రకటించారు. యువత భవిష్యత్తుతో చెలగాటమాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలోని

జంతర్‌మంతర్ వద్ద ప్రారంభమైన ఆందోళనలు దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో మొదలైన ఈ నిరసనలకు పలు విపక్ష పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపైనే పార్లమెంట్ ఉభయ సభల్లో వరుసగా వాయిదాలు చోటుచేసుకుంటున్నాయి.ఈ పరిణామాల మధ్య ప్రధాని మోదీ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందించారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై వేగవంతమైన న్యాయ ప్రక్రియ జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.యువత సంక్షేమమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ప్రధాని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే నేరాలను సహించబోమని, నేరస్థులు తప్పించుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని చెప్పారు.ఇదే సమయంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా స్పందించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకోవద్దని ప్రతిపక్షాలకు సూచించారు. పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.ప్రధాని ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. యువత భవిష్యత్తుకు నష్టం కలిగింది ప్రభుత్వ వైఫల్యం వల్లేనని ఆరోపించారు. విద్యావ్యవస్థ బలహీనపడుతున్నా ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోకుండా వారిని రక్షించిందని విమర్శించారు. విద్యార్థుల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయని పేర్కొంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, విద్యార్థులకు ప్రభుత్వం బహిరంగ క్షమాపణ చెప్పాలని, నిరసనల సందర్భంగా విద్యార్థులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అటు సీజేపీ కూడా ప్రధాని ప్రకటనపై స్పందిస్తూ, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు ఒక్కటే సరిపోదని పేర్కొంది. పేపర్ లీక్‌కు రాజకీయ, పరిపాలనా బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని తమ డిమాండ్‌ను మరోసారి పునరుద్ఘాటించింది. ఈ మేరకు పార్టీ 'ఎక్స్' వేదికగా ప్రకటన విడుదల చేసింది.రాజధాని దిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. సీజేపీ చేపట్టిన నిరసనల దృష్ట్యా గురువారం కూడా నగరంలోని 16 మెట్రో స్టేషన్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. పలు ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలను మోహరించి, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టారు.నీట్ పేపర్ లీక్ వివాదం ప్రస్తుతం రాజకీయంగానే కాకుండా దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల నిర్ణయం అమలు ఎలా ఉంటుందన్న దానిపై దృష్టి నెలకొనగా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కొనసాగుతున్న డిమాండ్‌కు కేంద్రం ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# రాష్ట్రంలో 70 శాతం ఎస్ఐఆర్ పూర్తి

- తప్పుడు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- హైడ్రా సమర్థంగా పనిచేస్తోంది.. భారీగా ఆస్తుల స్వాధీనం: సీఎం

**హైదరాబాద్, వెలుతురు జూలై 2026:**

రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ 70 శాతం పూర్తయిందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో అర్హులైన వారి ఓట్లు తొలగించే అవకాశం ఉందని భావించి, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) నియమించామని చెప్పారు. ఓటు లేకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై మాట్లాడారు.తనకు రెండు చోట్ల ఓటు ఉందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. తనపై ఆరోపణలు చేస్తున్నవారు ఎన్నికల అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేయాలని సవాల్ విసిరారు. తప్పుడు ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాను కలెక్టర్‌కు దరఖాస్తు చేసి నిబంధనల ప్రకారం ఓటును బదిలీ చేయించుకున్నానని స్పష్టం చేశారు.గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓట్లను పెద్ద ఎత్తున తొలగించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ పార్టీ కోర్టును ఆశ్రయించగా అప్పటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు.హైడ్రా పనితీరుపై స్పందిస్తూ.. ఆ సంస్థ సమర్థంగా పనిచేస్తోందని, పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టులో జరిగిన అవినీతి కారణంగానే హరీశ్‌రావును కొంతకాలం మంత్రి పదవికి దూరంగా ఉంచారని కేసీఆర్‌పైన కూడా విమర్శలు చేశారు.గ్లోబరీనా వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన నిజాయతీని నిరూపించుకోవాలని సీఎం డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటర్ పరీక్షల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల వల్ల 27 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంటూ.. ఆ ఘటనపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని కోరారు.నీట్ పేపర్ లీక్ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. బీజేపీ నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నాయని వ్యాఖ్యానించారు.పేదలకు కేటాయించిన ఇళ్లను బీఆర్ఎస్ నాయకులు దళారులకు విక్రయించారని ఆరోపించిన రేవంత్‌రెడ్డి.. జన్వాడ ఫామ్‌హౌస్ భూముల వ్యవహారంపై కేటీఆర్ స్వయంగా విచారణ కోరాలని సవాల్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ప్రారంభించామని, గతంలో దానిని మూసివేసిన వారే ఇప్పుడు అక్కడ ధర్నా చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## జంతర్ మంతర్ ఆందోళనలు రాజకీయ ప్రేరేపితం

- విద్యార్థులకు నష్టం జరగొద్దనే నీట్ పరీక్ష పునఃనిర్వహణ
- కాంగ్రెస్, వామపక్షాల నేతలు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
- తెలంగాణలో పేపర్ లీకైతే సీఎం రేవంత్ రాజీనామా చేశారా? అని నిలదీత

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

దేశ రాజధానిలోని జంతర్ మంతర్‌తో పాటు వివిధ రాష్ట్రాలలో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని, ఇవన్నీ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులే దీని వెనుక ఉన్నట్లు అనుమానం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. గురువారం న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన ఆయన, ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**విద్యార్థుల భవిష్యత్తే మా ప్రాధాన్యం**

నీట్ పేపర్ లీక్‌కు పాల్పడిన వారిని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అరెస్ట్ చేసి జైలుకు పంపిందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే మళ్లీ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. నీట్‌తో పాటు అన్ని అంశాలపై చర్చకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. అంతేకాకుండా, పేపర్ లీక్‌లను అరికట్టేందుకు ఫాస్ట్ ట్రాక్ ద్వారా కఠిన చర్యలు తీసుకునేలా 2024 చట్టాన్ని సైతం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు.

**కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు**

జంతర్ మంతర్ వేదికగా విద్యార్థుల ఆందోళనలను ఆసరాగా చేసుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

'యూపీఏ హయాంలో ప్రశ్నపత్రాలు లీక్ అయినప్పుడు కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా? కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి ఉందా?

తెలంగాణలో పదో తరగతి పేపర్ లీకైతే సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు?' అంటూ కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

# కేటీఆర్ కీలక వ్యాఖ్యలు

**వరంగల్ వెలుతురు జూలై 2026:**

గ్లోబరీనా (గ్లోబల్ ఏరినా) సంస్థ తన బినామీ కంపెనీ అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పూర్తిగా తోసిపుచ్చారు. ఆ సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆధారాలు లేని అసత్య ఆరోపణలు చేసినందుకు ముఖ్యమంత్రికి ఇప్పటికే పరువు నష్టం (డిఫమేషన్) లీగల్ నోటీసు పంపినట్లు వెల్లడించారు. వరంగల్ జిల్లా మడికొండలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో జరిపిన చిట్‌చాట్‌లో కేటీఆర్ ఈ విషయాలపై ఘాటుగా స్పందించారు.గ్లోబరీనా సంస్థ నిజంగానే తన బినామీ సంస్థ అయితే, అదే కంపెనీతో ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అధికారిక ఒప్పందాలు చేసుకుందో సమాధానం చెప్పాలని కేటీఆర్ నిలదీశారు. ఒకవైపు సదరు సంస్థతో కాంగ్రెస్ సర్కార్ ఒప్పందాలు కుదుర్చుకుంటూ, మరోవైపు రాజకీయ స్వార్థం కోసం అది తన బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి ఆరోపించడం ఆయన ద్వంద్వ నీతికి నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజాయితీ లేదని, కేవలం ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇటువంటి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ వైఖరిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి పగటిపూట కాంగ్రెస్ పార్టీ నేతగా నటిస్తూ, రాత్రి వేళల్లో బీజేపీ నాయకులతో సత్సంబంధాలు నెరుపుతున్నారని ఆరోపించారు. "ప్రస్తుతం తెలంగాణలో రేవంత్ రెడ్డి మార్కు పాలన సాగుతోంది. కాంగ్రెస్ అధిష్టానానికి ఒక మూట పంపితే, బీజేపీ పెద్దలకు రెండు మూటలు పంపుతున్నారు" అని వ్యాఖ్యానిస్తూ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర వనరులను తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.గ్లోబరీనా వ్యవహారం మరియు ఇతర ఆరోపణలపై తాను ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ ప్రకటించారు. సిబిఐ విచారణను ఎదుర్కోవడానికి తాను పూర్తి సిద్ధంగా ఉన్నానని, అంతకంటే ముందడుగు వేసి అవసరమైతే లై డిటెక్టర్ (లై డిటెక్షన్) పరీక్షకు కూడా తాను సిద్ధమని సీఎంకు బహిరంగ సవాల్ విసిరారు. నిజాయితీ నిరూపించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ధైర్యం ఉంటే లై డిటెక్టర్ పరీక్షకు రావాలని సవాల్ విసిరారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని, ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కనీసం మోదీ పేరును ప్రస్తావించడానికి కూడా భయపడుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గతంలో తనపై ఉన్న పాత కేసులు, అమృత్ పథకం కాంట్రాక్టులు, ఇతర కుటుంబ ప్రయోజనాలను కాపాడుకోవడం కోసమే రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో లోపాయికారీగా రాజీ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంపై పోరాడాల్సిన సమయంలో మోదీకి లొంగిపోయి పనిచేస్తున్నారని విమర్శించారు.ప్రతిపక్ష నేతలపై అబద్ధపు కేసులు, విచారణలు అంటూ బెదిరింపులకు దిగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తన సొంత కుటుంబంపై వస్తున్న భారీ అవినీతి ఆరోపణలపై విచారణకు సిద్ధపడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రత్యేక విచారణ బృందం (సిట్) లేదా సీఐడీ విచారణ వేయడానికి ముఖ్యమంత్రికి ధైర్యం ఉందా అని ప్రతిసవాల్ విసిరారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి విపక్షాలపై నిందలు వేయడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాజ్‌భవన్ ముట్టడి లేదా ధర్నా నిర్వహించాల్సింది పోయి, ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ధర్నాలు చేయడం కేవలం ఒక రాజకీయ నాటకమని కేటీఆర్ కొట్టిపారేశారు.

# హైదరాబాద్‌లో ‘11వ అఖిల భారత పోలీసు జూడో క్లస్టర్–2026’ పోటీలను ప్రారంభించిన కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి బండి సంజయ్

- **పోలీసు క్రీడలు జాతీయ ఐక్యతను బలోపేతం చేస్తాయి, ప్రతిభను ప్రోత్సహిస్తాయి: బండి సంజయ్ కుమార్**
- **జూడో క్లస్టర్‌లో పాల్గొంటున్న 36 రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల విభాగాలకు చెందిన 1,600 మంది క్రీడాకారులు**

**హైదరాబాద్ వెలుతురు జులై 23:**










గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్–2026’ క్రీడా పోటీలను కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ గురువారం రోజున ప్రారంభించారు.ఈ సందర్భంగా కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ప్రసంగించారు. దేశ నిర్మాణానికి, యువత సాధికారతకు సాధనంగా క్రీడలను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆయన అన్నారు. ఖేలో ఇండియా, ఆసియా క్రీడలు, ప్రపంచ పోలీసు–అగ్నిమాపక క్రీడలు తదితర కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా క్రీడా మౌలిక వసతులను కేంద్రం విస్తరిస్తోందని చెప్పారు. కేంద్రం క్రీడల బడ్జెట్‌ను రూ.4,480 కోట్లకు పెంచిందన్నారు. గతేడాది కేటాయింపుల కంటే ఇది రూ.1,100 కోట్లకు పైగా అధికంగా ఉందని తెలియజేశారు. ప్రపంచ క్రీడాశక్తిగా ఎదగాలన్న భారత లక్ష్యాన్ని శ్రీ బండి సంజయ్ కుమార్ పునరుద్ఘాటించారు. 2047 నాటికి అయిదు అగ్ర క్రీడా దేశాల్లో ఒకటిగా మారాలన్న దేశ దీర్ఘకాలిక ఒలింపిక్ లక్ష్యం గురించి వివరించారు.‘‘ఇలాంటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బందిని ఒకే వేదిక మీదకు తీసుకువస్తాయి. స్నేహాన్ని, పరస్పర అవగాహనను, సోదరభావాన్ని పెంపొందిస్తాయి. తద్వారా జాతీయ ఐక్యతను, దేశ సమగ్రతను బలోపేతం చేస్తాయి’’ అని ఆయన అన్నారు. పోలీసు క్రీడల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం గురించి కూడా ఆయన ప్రస్తావించారు. దీనిని సమ్మిళిత్వం, సాధికారత దిశగా వేసిన ముందడుగుగా వర్ణించారు. ఈ పోటీలు స్వర్ణం, రజతం, కాంస్య పతకాలను గెలవడం కోసం మాత్రమే కాదని అభిప్రాయపడ్డారు. ‘‘దేశభద్రతను కాపాడుతూ, కీలకమైన ప్రదేశాలకు రక్షణ కల్పిస్తూ, ప్రజాక్షేమం కోసం నిరంతరం శ్రమించే భద్రతా దళాలు, పోలీసుల జీవితాల్లో క్రీడలు విడదీయరాని భాగం’’ అని ఆయన తెలిపారు.1969 నుంచి దేశంలో అత్యంత కీలమైన ఆస్తులకు, మౌలిక వసతులకు అవసరమైన భద్రతను సీఐఎస్ఎఫ్ అందిస్తోందని కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి చెప్పారు. వాటిలో విమానశ్రయాలు, ఢిల్లీ మెట్రో, వారసత్వ కట్టడాలు, అణు, అంతరిక్ష సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు, జైళ్లు, దేశ ప్రజాస్వామ్యానికి ప్రతీక అయిన పార్లమెంటు సముదాయం ఉన్నాయన్నారు. ‘‘ఇటీవలే జరిగిన ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీఐఎస్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ అభిమన్యు స్వర్ణ పతకం సాధించారు. అంతర్జాతీయ రెజ్లింగ్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానాన్ని సాధించారు. ఇది మనందరికీ గర్వకారణం. ఇది క్రీడలకు సీఐఎస్ఎఫ్ ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, ఇటీవలే సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం నాకు నిజంగా గర్వాన్ని కలిగించింది. అథ్లెట్ల సంక్షేమం కోసం అనేక ముఖ్యమైన కార్యక్రమాలను ఈ దళం చేపడుతోంది. సంక్షేమ పథకాలను విస్తరించింది. అథ్లెట్లకు ఇప్పుడు నేరుగా అదనపు ఆర్థిక సాయం లభిస్తోంది. నాణ్యమైన పోషకాహారం, ఆధునిక క్రీడా సామగ్రి లేదా గాయాల నుంచి త్వరగా కోలుకోవడానికి అవసరమైన సౌకర్యాల విషయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావు. ఈ చర్యలన్నీ మన అథ్లెట్లు తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, దేశానికి మరిన్ని విజయాలను తీసుకురావడానికి దోహదపడతాయి’’ అని ఆయన అన్నారు. సీఐఎస్ఎఫ్ ఏడీజీ (సౌత్) పద్మాకర్ ఎస్ రన్పిసే, సీఐఎస్ఎఫ్ ఏపీఎస్–II ఐజీ ఎస్ఆర్ శరవణన్, సీఐఎస్ఎఫ్ ఐజీ, ఎన్ఐఎస్ఏ డైరెక్టర్ శ్రీమతి హర్‌ప్రీత్ కౌర్ సోహి, పీఐబీ ఏడీజీ శ్రీమతి శ్రుతి పాటిల్, ఇతర ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 జులై 23 నుంచి 30 వరకు 11వ అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్–2026 పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో 36 రాష్ట్ర పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) విభాగాలకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరు జూడో, వుషు, తైక్వాండో, కరాటే, పెన్చాక్ సిలాట్ క్రీడల్లో పోటీపడతారు.

# యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వేద మంత్రోచ్చారణలు, హోమాగ్నుల మధ్య ఘనంగా నిర్వహించిన వరుణయాగ పూర్ణాహుతిలో పాల్గొన్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ





- **రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, రైతాంగ శ్రేయస్సు, ప్రకృతి సమతుల్యత నెలకొనాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ప్రార్థించిన మంత్రి సురేఖ**
- **రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రకృతి సమతుల్యత నెలకొనాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో వరుణయాగం కార్యక్రమాలు**
- **ఇప్పటికే రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో రాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డిగారు ఈ సమస్యను అధిగమించడానికి కార్యాచరణను అమలు చేస్తున్నారని స్పష్టత**
- **మానవశక్తికి దైవశక్తి కూడా తోడవ్వాలనే సంకల్పంతో రాష్ట్రంలోని దేవాలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నామన్న మంత్రి**

**యాదగిరిగుట్ట వెలుతురు జూలై 23:**

ప్రకృతిని దైవస్వరూపంగా ఆరాధించే భారతీయ సంస్కృతిలో వరుణ యాగం అనేది కేవలం ఒక వైదిక క్రతువు మాత్రమే కాదని, ప్రకృతి సమతుల్యత, ప్రజల శ్రేయస్సు, సమృద్ధిగా వర్షాలు కురవాలనే మహా సంకల్పానికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలతో రైతాంగం సుభిక్షంగా ఉండాలని, చెరువులు, నదులు, జలాశయాలు నిండుకుండల్లా కళకళలాడాలని, పచ్చదనం వెల్లివిరియాలని, పాడిపంటలతో తెలంగాణ రైతాంగం వర్ధిల్లాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. ఈ మేరకు రాష్ట్రంలోని దేవాలయాల్లో వరుణ యాగం నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో రాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డిగారు ఈ సమస్యను అధిగమించడానికి కార్యాచరణను అమలు చేస్తున్నారని అన్నారు. మానవశక్తికి దైవశక్తి కూడా తోడవ్వాలనే సంకల్పంతో రాష్ట్రంలోని దేవాలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. “పంచభూతాలను దైవస్వరూపాలుగా భావించే నేల ఇది. మన సంస్కృతి ప్రకృతిని జయించమని కాదు, ప్రకృతితో కలిసి జీవించమని బోధిస్తుంది. ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రకృతి కూడా తోడవ్వాలి. అందుకే ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ, వేద సంప్రదాయాలను పరిరక్షిస్తూ రాష్ట్రంలోని దేవాలయాల్లో వరుణ యాగాలు నిర్వహిస్తున్నాం. ఇది కేవలం ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాదు, ప్రకృతి పట్ల మన కృతజ్ఞతను, బాధ్యతను వ్యక్తపరిచే భారతీయ జీవన తత్వం. అందుకే వేదకాలం నుంచి ప్రకృతి అనుగ్రహం కోసం యజ్ఞయాగాదులను నిర్వహించే సంప్రదాయం కొనసాగుతున్నది” అని మంత్రి సురేఖ అన్నారు. ఈ కార్యాచరణలో భాగంగా యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన వరుణ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, హోమాగ్ని జ్వాలల మధ్య వేదపండితులతో కలిసి మంత్రి సురేఖ అగ్నిదేవునికి పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, రైతాంగ శ్రేయస్సు, ప్రకృతి సమతుల్యత, సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ సస్యశ్యామలంగా మారాలని శ్రీ లక్ష్మీనరసింహస్వామిని మంత్రి సురేఖ ప్రార్థించారు.దేవాలయానికి వచ్చిన మంత్రి గారికి దేవస్థాన ఈఓ భవానీ శంకర్, డిప్యూటీ ఈవో భాస్కర్, ప్రధాన అర్చకులు, వేదపండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూర్ణాహుతి అనంతరం దేవస్థాన అర్చకులు మంత్రికి వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ గారితో పాటు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ లక్ష్మి నారాయణ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని హుస్నాబాద్ లోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ వెలుతురు జూలై 23:**

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో జీవించాలని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.హుస్నాబాద్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హుస్నాబాద్ అయ్యప్ప ఆలయంలో 108 మంది రుత్వికులతో, 21 హోమగుండాలతో నిర్వహించిన శ్రీ వారాహి మూల మంత్ర హోమ మహాయజ్ఞంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదుపరి శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన మంత్రి, 108 కలశాలతో మరకత శివాలయంలో నిర్వహించిన వరుణ యాగంలో పాల్గొని రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోందన్నారు. అమ్మవారి అనుగ్రహంతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయం పుంజుకోవాలని, రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల సంక్షేమంతో పాటు “సర్వేజనా సుఖినో భవంతు” అనే భావనతో సమాజ శ్రేయస్సు కోసం కూడా ప్రార్థించాలని మంత్రి పిలుపునిచ్చారు. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, రైతు బాగుంటేనే వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తులవారు సహా సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.వారాహి అమ్మవారి కృపాకటాక్షంతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యాలతో ఉండాలని, ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని మంత్రి కోరుకున్నారు. ఈ మహాయజ్ఞాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న వేద పండితులు, నిర్వాహకులు, యజ్ఞ దంపతులను మంత్రి అభినందించారు.ఈ కార్యక్రమాల్లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద విద్యార్థిని ఉన్నత చదువులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆర్థిక భరోసా

- **జర్మనీ విశ్వవిద్యాలయంలో చదివేందుకు 10లక్షల ఆర్థిక సాయం అందజేత**

**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**

నిరుపేద విద్యార్థిని కలలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అండగా నిలిచారు. దేవరకొండకు చెందిన ఓ నిరుపేద రోజువారీ కూలీల కుటుంబానికి చెందిన విద్యార్థిని పరిమళకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుగా నిలవలేదు. ఐఐటీ మద్రాస్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసిన ఆమె, జర్మనీలో మాస్టర్స్ చదివేందుకు ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో సీటు సాధించింది. అయితే, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె కలలు నెరవేరుతాయా లేదా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది.ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టికి రావడంతో, ఆయన ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులను పిలిపించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వారిని మంత్రి గారిని కలిసేలా ఏర్పాట్లు చేశారు.విద్యార్థిని సాధించిన విజయాన్ని, ఆమె ఉన్నత చదువుల పట్ల ఉన్న అంకితభావాన్ని తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆపద్బాంధవుడిలా స్పందించారు. పేదరికం కారణంగా ప్రతిభ మరుగున పడకూడదనే ఉద్దేశంతో 'కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా వెంటనే రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించి, ఆమె విదేశీ ఉన్నత విద్యకు అండగా నిలిచారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు మాట్లాడుతూ... "ప్రతిభకు పేదరికం ఎప్పుడూ అడ్డుకాదు. అవకాశం కల్పిస్తే నిరుపేద విద్యార్థులు ప్రపంచ వేదికపై తమ సత్తా చాటగలరు. పేద విద్యార్థుల కలలను సాకారం చేయడంలో, వారి ఉన్నత విద్యకు భరోసాగా నిలవడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటాను" అని పేర్కొన్నారు.జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించబోతున్న ఆ విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు.



# కరీంనగర్ TGNPDCL కార్యాలయం వద్ద ఘనంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS) 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**


**కరీంనగర్ వెలుతురు జూలై 23:**



కరీంనగర్ నగరంలోని TGNPDCL కార్యాలయం వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్ (BMS) 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా హాజరై భారతీయ మజ్దూర్ సంఘ్ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశంలో అతిపెద్ద కార్మిక సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. విద్యుత్ రంగంలో అహర్నిశలు శ్రమిస్తున్న TGNPDCL రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి BMS నిరంతరం పోరాటం చేస్తోందని కొనియాడారు. కార్మికుల సంక్షేమం, భద్రత, న్యాయమైన హక్కుల పరిరక్షణలో BMS చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, కంపెనీ ప్రెసిడెంట్ గుగులోతు రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షులు జి. సురేందర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. ఫకీర్ దాస్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్,BMS జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, BMS విద్యుత్ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గుడి అంటే రాయి కాదు... భావన!

రాతి కొండలను తొలిచి, శిల్పులు అహోరాత్రులు శ్రమించి, అద్భుతమైన దేవాలయాలను నిర్మిస్తారు. ఆ దివ్య గోపురాల నీడన నిలబడి, గంభీరమైన గంటానాదాన్ని వింటూ, మంగళ కర్పూర హారతి కాంతులను తిలకిస్తున్నప్పుడు ప్రతి ఒక్కరి మనస్సు అపూర్వమైన ప్రశాంతతను పొందుతుంది. అయితే, ఇక్కడ ఒక ప్రాథమికమైన ఆధ్యాత్మిక ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఆ ప్రశాంతత కేవలం రాతి గుడి గోడల మధ్య మాత్రమే లభ్యమవుతుందా? లేక అది మానవుని అంతరంగంలో, మనం గుర్తించని ఒక నిగూఢ కోణంలో దాగి ఉందా?ఈ ప్రశ్నను లోతుగా పరిశీలిస్తే, మన సనాతన ధర్మం మరియు వేద పండితులు, పెద్దలు చాటిచెప్పిన పురాతన అమృత వాక్యం గుర్తుకు వస్తుంది"దేహో దేవాలయః ప్రోక్తః". అంటే, మన శరీరమే ఒక నిత్య పవిత్రమైన దేవాలయం. బాహ్య ప్రపంచంలోని భౌతిక కట్టడాల కంటే అత్యంత పవిత్రమైన ఆలయాన్ని ప్రతి మానవుడు తన ఆంతరంగిక జీవనంలో, తన హృదయ పరిధిలోనే నిర్మించుకోగలడని ఈ సూత్రం స్పష్టం చేస్తోంది.సమాజంలో ఒక ప్రాథమిక అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. ఒక భౌతిక నిర్మాణాన్ని పవిత్ర ఆలయంగా మార్చేది కేవలం రాతి కట్టడమో, సిమెంట్ ప్రహరీయో కాదు. అక్కడ నెలకొన్న భక్తి భావన, అంతర్గత పవిత్రత, ప్రశాంత వాతావరణం, మరియు మానవులు తమ అహంకారాన్ని విస్మరించి దైవత్వంలో లీనమయ్యే ఆ పవిత్ర క్షణం. అటువంటి మహోన్నత వాతావరణాన్ని మనం మన అంతరంగంలో కూడా సృష్టించుకునే సామర్థ్యం కలిగి ఉన్నాము.క్రోధం, అసూయ, ద్వేషం, స్వార్థం అనే మానసిక రుగ్మతలను విడిచిపెట్టి, మనస్సును నిర్మలంగా ఉంచుకున్న ప్రతిసారీ, మనం మన లోపల ఒక ఆధ్యాత్మిక గర్భగుడిని నిర్మిస్తున్నామని గుర్తించాలి. ఆ హృదయ గర్భగుడిలో వెలిగే ఆరిపోని దివ్యదీపమే మంచితనం.తెలుగు సమాజంలో తరతరాలుగా ప్రచారంలో ఉన్న నానుడి మనసే గుడి, మనిషే దేవుడు. ఇది కేవలం లోకోక్తి లేదా ఆకర్షణీయమైన నినాదం కాదు; అత్యంత సమగ్రమైన జీవన సత్యం. బాహ్య ప్రపంచంలోని ప్రాసిద్ధ ఆలయ సందర్శనకు ప్రయాణ దూరం, విశేష సమయం, అనుకూల సందర్భాలు అవసరమవుతాయి. కానీ, మన అంతరంగంలోని ఆలయం నిరంతరం మనతోనే ప్రయాణిస్తుంది. నిద్రలో, నిత్యకృత్యాల నిర్వహణలో, కష్టాల్లో, సంతోషంలో అన్ని వేళలా అది మనలోనే సురక్షితంగా ఉంటుంది.సమాజంలో భౌతిక ఆలయ నిర్మాణానికి ఇటుకలు, రాళ్ళు, సున్నం మరియు శిల్పకళ ఎంత అవసరమో, అంతరంగంలో ఆధ్యాత్మిక ఆలయాన్ని నిర్మించుకోవడానికి కొన్ని విశిష్ట మానవీయ, నైతిక గుణాలు అత్యంత ప్రాధాన్యత వహిస్తాయి.సత్యం (పునాది రాయి) అబద్ధాల పునాదులపై ఏ భౌతిక నిర్మాణమూ నిలబడలేదు. అలాగే అసత్యాల ఆధారంగా మనస్సు ఎప్పటికీ శాంతిని పొం దలేదు. సత్యమే ఈ ఆంతరంగిక ఆలయానికి మూలస్తంభం.కరుణ (ప్రహరీ గోడలు) ఇతరుల కష్టాలను, వేదనలను అర్థం చేసుకోగలిగే ఆర్ద్రత కలిగిన హృదయమే మనలోని ఆలయానికి రక్షణ గోడగా నిలుస్తుంది.సహనం (దివ్య గోపురం) ఉన్నతంగా, దృఢంగా నిలబడటానికి సహనం అత్యంత ఆవశ్యకం. జీవితంలో ఎదురయ్యే కష్టాల వానలకు, విమర్శల తుఫానులకు చెక్కుచెదరకుండా నిలిచేది ఒక్క సహన గుణమే.నిస్వార్థ సేవ (ఆలయ ఘంట) మనం చేసే ప్రతి నిస్వార్థ సేవ మరియు మంచి పని, ఆలయ గంట మోగించినట్లుగా సమాజంలో ఉన్న ఇతర వ్యక్తులకు



వినిపిస్తుంది, వారిలో స్ఫూర్తిని నింపుతుంది.ధ్యానం (ఆరిపోని నందాదీపం) దైనందిన జీవితంలో కొంత సమయాన్ని కేటాయించి, మౌనంగా ఆత్మ పరిశీలన చేసుకునే అలవాటు, ఆంతరంగిక దీపాన్ని ఎప్పుడూ కాంతివంతంగా వెలిగిస్తుంది.ఈ అత్యున్నత గుణాలన్నీ కలగలిసినప్పుడే, మానవునిలో నిజమైన ఆధ్యాత్మిక ఆలయం పరిపూర్ణంగా రూపు దిద్దుకుంటుంది.ఈ క్రమంలో ఒక సాంప్రదాయ సందేహం ఉత్పన్నమయ్యే అవకాశముంది .మరి బాహ్య దేవాలయాల సందర్శన నిరుపయోగమా? అని. దీనికి సమాధానం ఖచ్చితమైన కాదనడమే. బాహ్య దేవాలయాలు మానవ జీవితానికి క్రమశిక్షణను నేర్పుతాయి, సమాజంతో కలసి ఆధ్యాత్మిక భావాలను పంచుకునే విస్తృత అవకాశాన్ని కల్పిస్తాయి, మన ప్రాచీన సంస్కృతీ సాంప్రదాయాలను పరిరక్షిస్తాయి. ఆలయ ఘంటానాదాలు, వేదమంత్రోచ్ఛారణలు, సామూహిక ప్రార్థనలు మనస్సుకు సరైన దిశానిర్దేశం చేస్తాయి.అయితే ఆ మార్గంలో ఆచరణాత్మకంగా నడవాల్సింది మాత్రం మానవుడే. బాహ్య ఆలయం మార్గాన్ని సూచిస్తే, లోపలి ఆలయం ఆ మార్గంలో మనం ఎంతటి ఆత్మశుద్ధి సాధించామో నిరూపిస్తుంది.
గొప్ప ఆధ్యాత్మిక వేత్తల విశ్లేషణ ప్రకారం, బాహ్య ఆరాధన అనేది అంతరంగ పరివర్తనకు బలమైన సాధనంగా మారాలి తప్ప, అదే అంతిమ గమ్యస్థానం కాకూడదు. ఆలయాన్ని సందర్శించిన తర్వాత కూడా మనస్సులోని ద్వేషం, స్వార్థం తగ్గకపోతే ఆ ఆధ్యాత్మిక యాత్ర అసంపూర్ణమే అవుతుంది.ఇది కేవలం సిద్ధాంతపరమైన చర్చ మాత్రమే కాదు, రోజువారీ నిత్య జీవితంలో ఆచరించదగిన ఉత్తమ జీవన విధానం. ఉదయం లేవగానే ఈ రోజు నా మాటలతో గానీ, చేతలతో గానీ ఎవరినీ బాధించను అని దృఢ నిశ్చయం చేసుకోవడం ఒక పవిత్ర పూజా విధానం. ఆపదలో ఉన్న తోటి మనిషికి సాయం అందించడం ఒక దివ్యమైన అభిషేకం. తెలిసి చేసిన పొరపాట్లను అంగీకరించి సరిదిద్దుకోవడం ఒక ప్రాశ్చిత్త కర్మ. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు రోజంతా చేసిన పనులను నిష్పక్షపాతంగా ఆత్మపరిశీలన చేసుకోవడం ఒక మంగళ హారతి.ఈ రకంగా ప్రతి చిన్న చర్యనూ పవిత్ర బాధ్యతగా భావించినప్పుడు, మానవ జీవితమే ఒక నిరంతర ఆధ్యాత్మిక యజ్ఞంగా మారుతుంది.ఈ ఆంతరంగిక ఆలయ నిర్మాణం అత్యంత సులభమైనదని చెప్పలేము. బాహ్య ప్రపంచంలోని ఒత్తిళ్ళు, విపరీతమైన పోటీతత్వం, అసూయా ద్వేషాలు మన లోపలి ఆలయ మూలాలను కదిలిస్తుంటాయి. తీవ్రమైన క్రోధం ఆవహించినప్పుడు అంతరంగిక నందాదీపం ఆరిపోయినట్లు అనిపిస్తుంది.అయితే, భౌతిక దేవాలయాలు కాలక్రమేణా దెబ్బతిన్నప్పుడు భక్తులు వాటిని జీర్ణోద్ధరణ చేసి పునర్నిర్మిస్తారు. అదే విధంగా, మానవుడు కూడా ప్రతి తప్పిదం తర్వాత, తన లోపలి ఆలయాన్ని పునర్నిర్మించుకునే మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలి. ఇది మానవ జన్మకు మాత్రమే లభించిన అరుదైన అవకాశం.ప్రతి మనిషి తనలో ఒక విలక్షణమైన దేవాలయాన్ని నిర్మించుకోవాలి. ఈ నిర్మాణానికి భౌతిక రాళ్ళు, ఆర్థిక వనరులు, లేదా ఇతరుల అనుమతులు అవసరం లేదు. కావలసిందల్లా నిజాయితీ, కరుణ, సహనం, మరియు సేవాభావం మాత్రమే. ఈ నైతిక విలువలతో హృదయాన్ని అలసట లేకుండా అలంకరించుకున్నప్పుడు, మనస్సు అత్యంత పవిత్రమైన ఆలయంగా రూపాంతరం చెందుతుంది. బాహ్య ప్రపంచంలోని రాతి కట్టడాలు కాల ప్రవాహంలో మార్పులకు లోనవ్వవచ్చు, కానీ మన అంతరంగంలో నిర్మించుకున్న ఈ ఆధ్యాత్మిక ఆలయం, మనం ఉన్నంత కాలం నిర్మలంగా, నిశ్శబ్దంగా మనతోనే నిలిచి ఉంటుంది.కాబట్టి, శాంతిని వెతుక్కుంటూ దూర ప్రాంతాలకు వెళ్లే ముందు, ఒక్కసారి మన ఆంతరంగిక మనస్సులోకి తొంగి చూద్దాం. అక్కడ ఒక దివ్యమైన ఆలయం మన రాక కోసం నిరంతరం వేచి చూస్తోంది!



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# బీసీల వెనుకబాటుకు కారణం ఎవర్రా నాయనా..!

భారతదేశ చరిత్రను ఎంత లోతుగా అధ్యయనం చేసినా మన ముందుకు వచ్చే అత్యంత బాధాకరమైన సత్యాల్లో ఒకటి సామాజిక అసమానత. ఈ దేశ నాగరికతను నిర్మించిన చేతులు ఒకవైపు ఉంటే, ఆ నాగరికత ఫలితాలను అనుభవించిన వర్గాలు మరోవైపు కనిపిస్తాయి. పొలంలో అన్నం పండించిన రైతు, ఇల్లు కట్టిన మేస్త్రి, కిటికీలు దర్వాజాలు ఏర్పాటు చేసిన వడ్రంగి, వ్యవసాయ పనిముట్లు తయారు చేసిన కమ్మరి, మట్టి పాత్రలతో జీవనాన్ని సులభతరం చేసిన కుమ్మరి, బట్టలు నేసిన పద్మశాలి, చేపలతో సమాజానికి ఆహారం అందించిన బెస్త, పశుసంపదను సంరక్షించిన యాదవ, తాటి వృత్తిని కొనసాగించిన గౌడ, గ్రామీణ సేవలను అందించిన రజక (చాకలి), నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, మనకు బట్టలు కుట్టే మేర, సంచార జాతులు అనేక చేతివృత్తులపై ఆధార పడిన బీసీ వర్గాలు భారత ఆర్థిక వ్యవస్థకు శతాబ్దాలుగా వెన్నెముకగా నిలిచాయి. వారు సంపదను సృష్టించారు. సమాజాన్ని నిర్మించారు. ఉత్పత్తి చేశారు. సేవలు అందించారు. కానీ ఆ సంపదపై యాజమాన్యం, అధికార వ్యవస్థలో భాగస్వామ్యం, విద్యలో అవకాశాలు, రాజకీయ నిర్ణయాధికారం మాత్రం వారికి దూరంగానే మిగిలిపోయాయి.

"బీసీలు ఎందుకు వెనుకబడ్డారు?" అనే ప్రశ్నకు ఒకే ఒక్క కారణాన్ని చూపడం సాధ్యం కాదు. అది వేల సంవత్సరాల సామాజిక నిర్మాణం, విద్యా అవకాశాల అసమాన పంపిణీ, భూముల యాజమాన్య కేంద్రీకరణ, అధికార నిర్మాణాల్లో అసమాన భాగస్వామ్యం, తరువాతి కాలంలో రాజకీయ వినియోగం, అలాగే బీసీ సమాజంలోని అంతర్గత విభజనలు వంటి అనేక అంశాల సమ్మేళనం. ఈ చరిత్రను అర్థం చేసుకోకుండా బీసీల ప్రస్తుత పరిస్థితిని విశ్లేషించడం అసంపూర్ణమే అవుతుంది.

భారత సమాజంలో వర్ణవ్యవస్థ క్రమంగా సామాజిక చలనశీలతను అడ్డుకుంది. విద్య కొద్ది వర్గాలకే పరిమితమైంది. జ్ఞానాన్ని వారసత్వ ఆస్తిగా మార్చారు. భూములు, దేవాలయాలు, పరిపాలనా వ్యవస్థలు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమయ్యాయి. మరోవైపు శ్రమాధారిత వృత్తులు నిర్వహించిన వర్గాలు తరతరాలుగా ఉత్పత్తి చేసినప్పటికీ ఆ ఉత్పత్తిపై హక్కు పొందలేకపోయాయి. మనువాద సమాజం సూద్ర సమాజాన్ని విద్యకు దూరంగా ఉంచి, ఆస్తులపై హక్కు లేకుండా చేసి, అధికార వ్యవస్థలో ప్రవేశం నిరాకరిస్తే, ఆ సమాజం తరతరాలుగా వెనుకబడటం సహజ పరిణామమే.భారతదేశంలో బ్రిటిష్ పాలనపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, సామాజిక చట్టాల పరంగా కొన్ని సంస్కరణలు అణగారిన వర్గాలకు ఉపశమనం కలిగించాయి. 1773 రెగ్యులేటింగ్ చట్టం నుంచి ప్రారంభమైన పరిపాలనా మార్పులు, 1795 ప్రాంతీయ చట్టాల ద్వారా కొన్ని వర్గాలకు ఆస్తి హక్కుల గుర్తింపు, 1813లో విద్యకు సంబంధించిన అవకాశాల విస్తరణ, బానిసత్వ వ్యతిరేక చర్యలు, 1817లో నేరాలకు సమాన శిక్షల విధానం, 1829లో సతి నిర్మూలన, 1831లో ప్రభుత్వ ఉద్యోగాల్లో కుల, మత, వర్ణ వివక్షను తగ్గించే చర్యలు, 1856లో వితంతు వివాహాలకు చట్టబద్ధత వంటి సంస్కరణలు భారత సమాజంలో మార్పుకు దారితీశాయి. ఇవి సంపూర్ణ సమానత్వాన్ని తీసుకురాలేకపోయినా, శతాబ్దాలుగా కొనసాగిన కొన్ని సామాజిక అన్యాయాలకు చట్టపరమైన సవాలు విసిరాయి.

అయితే చట్టాలు మారితే సమాజం వెంటనే మారిపోదు. శతాబ్దాలుగా ఏర్పడిన అసమానతలు ఒకే తరంలో తొలగిపోవు. అందుకే భారత దేశంలో నిజమైన సామాజిక విప్లవానికి పునాది వేసింది విద్యా ఉద్యమం.ఈ సందర్భంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే చేసిన కృషి అపూర్వమైనది. అణగారిన వర్గాల పిల్లలకు, ముఖ్యంగా బాలికలకు విద్య అందించడం ద్వారా వారు కేవలం పాఠశాలలను ప్రారంభించలేదు, జ్ఞానంపై ఉన్న గుత్తాధిపత్యాన్ని సవాలు చేశారు. "విద్యే విముక్తికి మార్గం" అనే వారి విశ్వాసం భారత సమాజాన్ని కొత్త దిశగా నడిపించింది. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదు, మనిషి ఆత్మ గౌరవాన్ని తిరిగి పొందడానికి అవసరమైన శక్తి అని వారు చూపించారు.ఆ ఆలోచనలను మరింత విస్తృతమైన రాజకీయ, సామాజిక దృక్పథంతో ముందుకు తీసుకెళ్లిన మహానేత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. "చదువుకోండి, సంఘటితమవండి, పోరాడండి" అనే ఆయన పిలుపు నేటికీ బహుజన సమాజానికి మార్గదర్శక సూత్రంగానే నిలిచింది. విద్య లేకుండా స్వేచ్ఛ రాదని, సంఘటితం కాకుండా శక్తి రాదని, పోరాటం చేయకుండా హక్కులు రావని ఆయన స్పష్టంగా చెప్పారు. రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించినప్పటికీ వాటిని ఆచరణలోకి తీసుకురావడానికి నిరంతర సామాజిక చైతన్యం అవసరమని ఆయన హెచ్చరించారు.

స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా బీసీల పరిస్థితి పూర్తిగా మారిపోయిందా? కొంతమేరకు మారింది. విద్యావంతులు పెరిగారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రవేశించారు. రాజకీయాల్లో ప్రాతినిధ్యం కూడా కొంత పెరిగింది. కానీ మొత్తం బీసీ సమాజాన్ని పరిశీలిస్తే ఇంకా అనేక కుటుంబాలు భూమిలేని వ్యవసాయ కూలీలుగానే జీవిస్తున్నాయి. ఉన్నత విద్య, పరిశోధన, పరిపాలనా సేవలు, కార్పొరేట్ రంగం, విధాన నిర్ణయాల్లో వారి ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తికి తగిన స్థాయిలో లేదు. సామాజిక చలనశీలత పెరిగినా సమాన అవకాశాలు ఇంకా అందరికీ చేరలేదు.అయితే ఈ పరిస్థితికి చరిత్ర మాత్రమే కారణమని చెప్పడం సరిపోదు. బీసీ సమాజం తనలోని బలహీనతలను కూడా ధైర్యంగా పరిశీలించుకోవాలి. సంఖ్యలో అతిపెద్ద సామాజిక వర్గమైనప్పటికీ, వందలాది కులాలుగా విడిపోయి ఉండటం వారి ప్రధాన బలహీనతగా మారింది. ఒక కులం సమస్యను మరో కులం తన సమస్యగా భావించే సంస్కృతి బలపడలేదు. ఉమ్మడి లక్ష్యాల కోసం ఐక్యంగా ఉద్యమించే రాజకీయ, సామాజిక చైతన్యం పరిమితంగానే ఉంది. ఈ విభజన వల్ల సంఖ్యాబలం సామాజిక శక్తిగా, సామాజిక శక్తి రాజకీయ నిర్ణయాధికారంగా మారడంలో ఆటంకం ఏర్పడింది.ఈ పరిస్థితిని రాజకీయ పార్టీలు కూడా తమ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగించుకున్నాయనే విమర్శ ఉంది. ఎన్నికల సమయంలో బీసీల పేరుతో హామీలు ఇవ్వడం, కులాల వారీగా ఓట్లను సమీకరించడం, ఎన్నికలు పూర్తయ్యాక అదే వర్గాలను మరచిపోవడం దశాబ్దాలుగా కనిపిస్తున్న రాజకీయ ధోరణి. ఫలితంగా బీసీ సమాజం ఓటు బ్యాంకుగా ఉపయోగించబడినా, విధాన నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం మాత్రం ఆశించిన స్థాయికి చేరలేదు.

ఈ దేశ సంపదను సృష్టించినవారు ప్రధానంగా శ్రమజీవులేననే వాదనకు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. వ్యవసాయం, పశుపోషణ, మత్స్య సంపద, గ్రామీణ పరిశ్రమలు, చేతివృత్తులు, కళలు,ఇవన్నీ ప్రధానంగా బీసీ వర్గాల శ్రమపై ఆధారపడి అభివృద్ధి చెందాయి. కానీ సంపదను సృష్టించినవారికి దానిపై యాజమాన్యం రాకపోవడం భారత సమాజంలోని అత్యంత పెద్ద వైరుధ్యాల్లో ఒకటి. శ్రమించినవారు వెనుక బడగా, శ్రమ ఫలితాలను నియంత్రించినవారు ముందుకు వెళ్లిన పరిస్థితి చరిత్రలో స్పష్టంగా కనిపిస్తుంది.

నేటి పరిస్థితుల్లో విద్య బీసీలకు అత్యంత కీలకమైన ఆయుధం. అయితే విద్యను కేవలం ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే పరిమితం చేయకూడదు. ఉన్నత విద్య, పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాలు, పరిపాలనా సేవలు, న్యాయవ్యవస్థ, మీడియా, పారిశ్రామిక రంగాల్లో నాయకత్వాన్ని సాధించేందుకు విద్యను ఉపయోగించాలి. సమాజ మార్పుకు అవసరమైన మేధోశక్తి విద్య ద్వారానే ఏర్పడుతుంది.

రిజర్వేషన్ల అమలుపై కూడా ఇప్పటికీ చర్చ కొనసాగుతోంది. రాజ్యాంగం కల్పించిన అవకాశాలను పూర్తిగా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అనేక సామాజిక వర్గాలు విమర్శిస్తున్నాయి. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, శాసనసభలు, పార్లమెంట్ వంటి రంగాల్లో జనాభా నిష్పత్తికి తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్లు కొనసాగుతూనే ఉన్నాయి. సామాజిక న్యాయం కేవలం చట్టపుస్తకాల్లో ఉండకూడదు, పాలనా వ్యవస్థలో కనిపించాలి.చరిత్ర చెబుతున్న మరో గొప్ప సత్యం ఏమిటంటే,హక్కులు ఎవరూ స్వచ్ఛందంగా ఇవ్వరు. ప్రతి హక్కు వెనుక ఒక ఉద్యమం ఉంటుంది. ప్రతి సామాజిక మార్పు వెనుక ఒక సంఘటిత పోరాటం ఉంటుంది. బీసీ సమాజం కూడా ఈ సత్యాన్ని గుర్తించి, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం సామాజిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలి. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు విద్య, ఆర్థిక సాధికారత, రాజ్యాంగ అవగాహన, రాజకీయ బాధ్యత వంటి అంశాలపై ఉద్యమాలు బలపడాలి.ప్రత్యేకంగా యువత పాత్ర అత్యంత కీలకం. సామాజిక మాధ్యమాల్లో చర్చలు చేయడం మాత్రమే సరిపోదు. పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్, అంబేద్కర్ వంటి మహనీయుల రచనలను అధ్యయనం చేయాలి. రాజ్యాంగ విలువలను అర్థం చేసుకోవాలి. విద్య, నైపుణ్యం, వ్యాపార దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజాస్వామ్య అవగాహన,ఈ ఐదు రంగాల్లో బీసీ యువత ముందుకు వస్తే సమాజ భవిష్యత్తు గణనీయంగా మారుతుంది.అలాగే బీసీ సమాజంలో ఐక్యత కాలానుగుణ అవసరంగా మారింది. చిన్న చిన్న కుల విభేదాలను అధిగమించి ఉమ్మడి ప్రయోజనాల కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలి. సంఖ్యాబలాన్ని సామాజిక శక్తిగా, సామాజిక శక్తిని రాజకీయ ప్రభావంగా, రాజకీయ ప్రభావాన్ని విధాన మార్పులుగా మలచగలిగితేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుంది.రాజ్యాధికారం అనేది కేవలం ముఖ్యమంత్రి, మంత్రి లేదా ప్రజా ప్రతినిధి పదవులు పొందడమే కాదు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధానాలను రూపొందించే శక్తి, బడ్జెట్ కేటాయింపులపై ప్రభావం చూపే సామర్థ్యం, విద్యా అవకాశాలను విస్తరించే సంకల్పం, ఉపాధి అవకాశాలను పెంచే దృష్టి, సామాజిక న్యాయాన్ని అమలు చేసే పరిపాలనా చిత్తశుద్ధి, ఇవన్నీ కూడా రాజ్యాధికారంలో భాగమే. ఈ విస్తృతమైన అవగాహనతోనే బీసీ సమాజం ముందుకు సాగాలి.

గతాన్ని మరచిపోవడం ప్రమాదకరం. అదే సమయంలో గతంలోనే జీవించడం కూడా అభివృద్ధికి అడ్డంకి. చరిత్ర మనకు పాఠం చెప్పాలి కానీ భవిష్యత్తును నిర్దేశించకూడదు. చరిత్రను అర్థం చేసుకుని, వర్తమానాన్ని విశ్లేషించి, భవిష్యత్తును నిర్మించడమే సమాజ బాధ్యత. అందుకు విద్యను ఆయుధంగా, ఐక్యతను బలంగా, రాజ్యాంగాన్ని మార్గదర్శిగా, ప్రజాస్వామ్యాన్ని సాధనంగా స్వీకరించాలి.చివరగా ఒక విషయం స్పష్టంగా చెప్పాలి. బీసీలు వెనుకబడ్డారు అనేది చారిత్రక వాస్తవం. అయితే వారు శాశ్వతంగా వెనుకబడి ఉండాల్సిన అవసరం లేదు. చరిత్ర వారిని వెనక్కి నెట్టివేసినా, చైతన్యం వారిని ముందుకు నడిపించగలదు. మహాత్మా జ్యోతిరావు పూలే కలలు కన్న సమాన సమాజం, సావిత్రిబాయి పూలే వెలిగించిన విద్యా దీపం, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నిర్మించిన రాజ్యాంగ భారతం, బహుజన భాగస్వామ్య ప్రజాస్వామ్యం, ఇవన్నీ కేవలం ఆదర్శాలు కాదు,సాధించగల లక్ష్యాలు. అందుకు అవసరమైంది చదువు, సంఘటిత శక్తి, సామాజిక చైతన్యం, రాజ్యాంగంపై నమ్మకం, నిరంతర ప్రజాస్వామ్య పోరాటం.బీసీలు తమ చారిత్రక పాత్రను గుర్తించి, తమ సామాజిక శక్తిని సంఘటిత శక్తిగా మలచి, విద్యా–ఆర్థిక–రాజకీయ రంగాల్లో సమాన భాగస్వామ్యం సాధించేందుకు కృషి చేసిన రోజే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. అదే రోజు వెనుకబాటుతనానికి ముగింపు పలికే రోజు అవుతుంది. అదే రోజు సమానత్వ భారత నిర్మాణానికి కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# 50 ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కటైన స్నేహబంధం..

- ప్రగతి రిసార్ట్స్‌లో 1976 ఎస్ఎస్‌సి బ్యాచ్ స్వర్ణోత్సవ పునఃకలయిక ఘన విజయం
- చిన్ననాటి మధుర జ్ఞాపకాలతో భావోద్వేగాల వెల్లువ
- ఆటలు, పాటలు, సత్కారాలతో రెండు రోజుల ఆత్మీయ సమ్మేళనం

**శంకర్ పల్లి, వెలుతురు జులై 23 :**

విజయనగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1976 ఎస్ఎస్‌సి బ్యాచ్ స్వర్ణోత్సవ పునఃకలయిక (గోల్డెన్ జూబ్లీ రీయూనియన్) మండల పరిధిలోని ప్రగతి రిసార్ట్స్‌లో అత్యంత వైభవంగా, ఆత్మీయ వాతావరణంలో జరిగింది. దాదాపు ఐదు దశాబ్దాల అనంతరం కలుసుకున్న సహాధ్యాయులు తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రెండు రోజుల వేడుకను చిరస్మరణీయంగా మార్చుకున్నారు.కార్యక్రమానికి శ్రీమతి రమాదేవి స్వాగతం పలికి రెండు రోజుల కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఆమెతో పాటు శివప్రసాద్ నిర్వహించిన వినోదాత్మక ఐస్–బ్రేకర్ ఆటలు



ప్రారంభంలో ఉన్న సంకోచాన్ని తొలగించి అందరినీ ఒక్కటిగా కలిపాయి. జీవిత భాగస్వాములతో కలిసి హాజరైన సహాధ్యాయులు చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఆప్యాయతలు పంచుకున్నారు.ఈ సందర్భంగా టంగ్ ట్విస్టర్స్, పులుసు, బాంబింగ్ ది సిటీ, ఫ్రెండ్లీ బెలూన్ ఫైట్, టగ్ ఆఫ్ వార్ తదితర సరదా పోటీలు నిర్వహించగా, 65 ఏళ్లు దాటిన వారైనా చిన్నారుల ఉత్సాహంతో పాల్గొని సందడి చేశారు. ప్రతి ఒక్కరినీ ఘనంగా సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అనంతరం సహాధ్యాయులు రచించిన జ్ఞాపకాల రచనలు సభను భావోద్వేగానికి గురిచేశాయి. శ్రీమతి రమాదేవి రచించిన "స్మృతి పథం", శివప్రసాద్ రచించిన "మన బడి.. తీయటి జ్ఞాపకాల అమ్మ ఒడి..." రచనలు అందరినీ యాభై సంవత్సరాల క్రితం పాఠశాల రోజులలోకి తీసుకెళ్లాయి. వాటిని విన్న సహాధ్యాయులు నిలబడి కరతాళ ధ్వనులతో అభినందించగా, పలువురు ఆనందభాష్పాలు పెట్టుకున్నారు.సాయంత్రం సహాధ్యాయిని స్వర్ణలత అందించిన సంగీత విభావరి వేడుకకు మరింత శోభను చేకూర్చింది. ఆమె ఆలపించిన మధుర గీతాలు, అనంతరం సహాధ్యాయులందరూ కలిసి నిర్వహించిన సంగీత సందడి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ స్వర్ణోత్సవ పునఃకలయిక విజయవంతం కావడానికి నిర్వాహక బృందం దాదాపు ఆరు నెలలపాటు అంకితభావంతో కృషి చేసింది. ఈ ఏడాది జనవరిలో విజయనగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశంలో ఈ కార్యక్రమానికి రూపురేఖలు సిద్ధమయ్యాయి.రెండు రోజుల ఆత్మీయ సమ్మేళనం ముగిసే వేళ సహాధ్యాయులు భావోద్వేగంతో ఒకరినొకరు వీడ్కోలు పలుకుతూ, వచ్చే ఏడాదిలోపు మళ్లీ కలుసుకుందామని సంకల్పించారు. మధుర జ్ఞాపకాలు, మరింత బలపడిన స్నేహబంధాలతో ముగిసిన ఈ స్వర్ణోత్సవ పునఃకలయిక పాల్గొన్న ప్రతి ఒక్కరి జీవితంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది.ఈ వేడుకల్లో సోమసుందర్, శ్యాంసుందర్, నరహరి, శేషగిరి, కృష్ణ, కాశీనాథ్, బాలకృష్ణ, బ్రహ్మ, మల్లికార్జున్, రాజేశ్వరరావు, బాబా, రమణ, ప్రకాశ్, కె.ఎస్.రావు, విజయ్, శంకర్, వాణి, రమా, పద్మ, హేమ తదితర సహాధ్యాయులు తమ జీవిత భాగస్వాములతో కలిసి పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి నూతన సీఐ డి. స్వామి గౌడ్‌కు శుభాకాంక్షలు వెల్లువ..

- రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందనలు..
- ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని సీఐ హామీ

**కూకట్‌పల్లి, జూలై 23 వెలుతురు:**

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) డి. స్వామి గౌడ్‌ను రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సత్కరించి, పూల బొకేను అందజేసి స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా



వివేకానంద నగర్ సెక్టార్ ఎస్ఐ నర్మదా, ఎస్ఐ చంద్రశేఖర్‌లను కూడా శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ డి. స్వామి గౌడ్ మాట్లాడుతూ, కూకట్‌పల్లి ప్రాంతంలో బోనాలు, వినాయక చవితి వంటి ప్రధాన పండుగలు భారీ ఎత్తున నిర్వహించబడతాయని, ఈ నేపథ్యంలో ప్రజలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, కూకట్‌పల్లి పోలీసు అధికారులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ సమర్థవంతంగా స్పందిస్తోందని పేర్కొంటూ స్వామి గౌడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి. ప్రసాద్, కేవీ రావు, సూర్యనారాయణ, నాని, అఖిల్, యశ్వంత్ తదితరులు పాల్గొని నూతన సీఐ తో పాటు ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నీట్ పరీక్షలపై రాజకీయాలు మానుకోవాలి శిగ వీరస్వామి గౌడ్

**అదిబట్ల వెలుతురు జూలై 23:**

నీట్ పరీక్షల ముసుగులో కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర ప్రతిపక్షాలు చేస్తున్న రాజకీయాలను దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని బీజేపీ మాజీ అధ్యక్షులు, ఆదిభట్ల మున్సిపాలిటీకి చెందిన శిగ వీరస్వామి గౌడ్ అన్నారు.నీట్ పరీక్షలను అడ్డుపెట్టుకుని కమ్యూనిస్టులు, దేశ వ్యతిరేక శక్తులు దేశంలో విభజనాత్మక వాతావరణాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆర్టికల్ 370ని మళ్లీ తీసుకురావాలని, ఆర్ఎస్ఎస్‌ను బ్యాన్ చేయాలని మాట్లాడుతున్న వారిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు.సనాతన ధర్మానికి, ఆర్ఎస్ఎస్‌కు, నీట్ పరీక్షలకు అసలు సంబంధం ఏమిటో ప్రతిపక్షాలు ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అత్యంత బాధ్యతారాహిత్యమని విమర్శించారు.ఇది నవ భారతం, గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి భారతమని, ఇలాంటి విచ్ఛిన్నకర శక్తుల కుట్రలకు భారతీయ జనతా పార్టీ ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు.మోదీ గారిని బలహీనపరుస్తామనే పగటి కలలు కనడం రాహుల్



గాంధీ గారు ఇకనైనా మానుకోవాలని, సీనియర్ సిటిజన్ వయస్సుకు చేరువవుతున్న ఆయన కాస్త పరిణితితో ప్రవర్తిస్తే మంచిదని సూచించారు.

# రాహుల్‌కు అవమానం.. మోదీ క్షమాపణ చెప్పాలి

- శంకర్‌పల్లిలో కాంగ్రెస్ ఆగ్రహ నిరసన..

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 23:**

శంకర్‌పల్లి ఇంద్రారెడ్డి చౌరస్తా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆగ్రహ నినాదాలతో మార్మోగింది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి అధ్యక్షతన, మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రతిపక్ష నాయకుడిని రాజకీయ కక్షసాధింపుతో లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. విభిన్న అభిప్రాయాలను అణచివేసే ధోరణి దేశ ప్రజాస్వామ్య



వ్యవస్థకు ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కే ప్రతి ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని స్పష్టం చేశారు.రాహుల్ గాంధీకి జరిగిన అవమానానికి రాజకీయ బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విమర్శలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొనే బదులు అధికార బలంతో ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు.ఈ నిరసన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ఉదయ్ మోహన్ రెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి,



రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కాలే శ్రీకాంత్, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ శ్వేతా పాండురంగారెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కాసెట్టి చంద్రమోహన్, సేవాదళ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం ప్రశాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎంఎస్‌యూఐ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో డైరెక్టర్ తరుణ్ భాస్కర్, హీరోయిన్ ఇషారబ్బ ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 23 :**

శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలసిన 11 వ శతాబ్దపు మహిమగల శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో గురువారం టాలీవుడ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్, హీరోయిన్ ఇషారబ్బ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.

అనంతరం ఆలయ అర్చకులు వీరేశం,



కమిటీ సభ్యుడు హనుమంతు వారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. డైరెక్టర్, హీరోయిన్ మాట్లాడుతూ పురాతన ఆలయంలో పూజలు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

# ప్రతి ఇంటికీ మ్యాజిక్ సోక్ పిట్, ప్రభుత్వ భవనాల్లో రూఫ్ టాప్ హార్వెస్టింగ్ తప్పనిసరి

**శంకర్ పల్లి, వెలుతురు జులై 23 :**

ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి, రాబోయే కాలంలో త్రాగునీరు, సాగునీటి కొరత రాకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ శ్రీ సిహెచ్. కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం శంకర్పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన 'బీవీ–గ్రామ్ (జి)' (BV–GRAM) కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టబోయే పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ



పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో తీవ్ర నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకోసం జలసిరి పథకంలో భాగంగా మండలంలోని ప్రతి ఇంటికీ నీటి కుంట (మ్యాజిక్ సోక్ పిట్), ప్రతి ప్రభుత్వ భవన ఆవరణలో కమ్యూనిటీ సోక్ పిట్, రూఫ్ టాప్ హార్వెస్టింగ్ ప్లాంట్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలన్నారు. అలాగే వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు ప్రతి పొలానికి ఊట కుంట, ప్రతి గ్రామానికి చెరువుకుంట నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



అనంతరం ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ ప్రోగ్రామ్స్ ప్రగతిపై పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేకంగా రివ్యూ నిర్వహించారు.ఈ సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు, తహసీల్దార్ సురేందర్, ఎంపీఓ గిరిరాజు, హౌసింగ్ డిప్యూటీ ఈఈ శైలజ, మండల వ్యవసాయ అధికారి చైతన్య, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్ సహాయ ఇంజనీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# మహాకవి సినారె స్మారక సాహితీ పురస్కారానికి నామాల రవీంద్రసూరి ఎంపిక

**కూకట్ పల్లి జూలై 23 వెలుతురు:**

సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన ప్రముఖ కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరికి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక డా. సి. నారాయణరెడ్డి (సినారె) స్మారక సాహితీ పురస్కారం లభించింది. పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత మహాకవి డా. సినారె సాహిత్య వారసత్వాన్ని స్మరించుకుంటూ అందించే ఈ పురస్కారానికి రవీంద్రసూరిని ఎంపిక చేసినట్లు సినారె కళాపీఠం ప్రకటించింది. మహాకవి సినారె 95వ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక సాహిత్య సభలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నామాల రవీంద్రసూరి మాట్లాడుతూ, ప్రతిష్ఠాత్మక సినారె స్మారక సాహితీ పురస్కారానికి తనను ఎంపిక చేసిన ఎంపిక కమిటీ సభ్యులకు, సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని వ్యక్తిగత విజయంగా కాకుండా, తాను చేస్తున్న సాహిత్య సేవకు లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు



పేర్కొన్నారు. సాహిత్య రంగంలో విశిష్ట కృషి చేస్తున్న రవీంద్రసూరికి ఈ పురస్కారం ప్రకటించడంతో సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.

# శంకర్పల్లి నూతన సీఐగా రుద్వీర్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**శంకర్పల్లి, జులై 23 :**

శంకర్పల్లి నూతన సీఐగా రుద్వీర్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన మిర్ ముదాసర్ అలిని హైదరాబాద్ కమీషనరేట్ కు




బదిలీపై వెళ్లగా మల్కాజ్గిరి కమీషనరేట్లో పని చేస్తున్న రుద్వీర్ కుమార్ ను శంకర్పల్లికి బదిలీపై పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతానని తెలిపారు.

# ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది.. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ పూర్తి చేసుకోవాలి: కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి

**కూకట్‌పల్లి, జూలై 23 వెలుతురు:**

ప్రతి ఓటు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత విలువైనదని, ఎలాంటి కారణాలతోనూ ఒక్క ఓటు కూడా ఎస్ఐఆర్ (Special Intensive Revision) ప్రక్రియ నుంచి తప్పిపోకుండా ప్రతి ఓటరు తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ–బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం బాలానగర్ డివిజన్‌లోని శ్రీశ్రీ నగర్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన ఓటర్లతో మాట్లాడి, వారు నింపుతున్న దరఖాస్తు ఫారాలను పరిశీలించారు. దరఖాస్తుల నింపడంలో కొన్ని పొరపాట్లు చోటుచేసుకుంటున్నాయని గుర్తించిన ఆయన, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఓటరికి ఫారం నింపే విధానంపై స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిర్దిష్ట మార్గదర్శకాల ప్రకారం



కొనసాగాలని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో తమ పేరు ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, దానిని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ నెం.30 బీఎల్ఏ బందిగ బాల నరసింహ, పోలింగ్ బూత్ నెం.31 బీఎల్ఏ మాదరి శ్రీనివాస్, ముప్పూరి బాలరాజు, ఖాదర్, రుక్మద్దీన్, అలీం భాయ్, గాలి నరేష్, జమీర్, ఖల్నాయక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లి, క్రాంతినగర్ కాలనీలో రూ. 2 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 23:**

బాచుపల్లి డివిజన్ పరిధి క్రాంతినగర్ కాలనీలో సీఎంసీ నిధులతో మంజూరైన రూ.2 కోట్ల విలువైన రోడ్లు, పార్క్ అభివృద్ధి సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ రాజిరెడ్డి, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, మాజీ కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జీవన్ రెడ్డి, మురళి, నర్సింగరావు, కాలనీ సభ్యులు బుగ్గ రెడ్డి, రాజసుర, నవీన్, వంశీ,



శ్రీధర్, హరి, కృష్ణ, రఘు, కాలనీ వాసులు పాల్గొన్నారు

# మోడీ పోవాలి రాహుల్ రావాలి

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 23:**



మండల కేంద్రంలో నకిరేకల్ శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ మంత్రి వేముల వీరేశం ఆధ్వర్యంలో రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ తరుపున నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఇందులో అబ్దుల్ వాహిద్ మహమ్మద్ (అంజద్) 8వ వార్డు సభ్యులు మేజర్ గ్రామ పంచాయితీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్ఈఈటి పేపర్ ను లీక్ చేసినందున కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చెయ్యాలని కోరారు. అలాగే మోడీ ప్రభుత్వం రాహుల్ గాంధీ ని అరెస్ట్ చేసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పి ఢిల్లీ లోని జంతర్ మంతర్ లో విద్యార్థులు చేస్తున్న నీరసనను తక్షణమే గ్రహించి వారి యొక్క సవాళ్ళను వెంటనే పూర్తి చెయ్యాలని చెప్పారు. భారత దేశ ప్రజలు క్షేమంగా ఉండాలంటే మోడీ ప్రభుత్వం పోయి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిందే అని చెప్పుకొచ్చారు.

# మోత్కూర్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

**మోత్కూర్, జులై 23,వెలుతురు న్యూస్ :**



భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మోత్కూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని స్థానిక నూర్-ఎ-మసీదులో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఎరసానిపల్లి సందీప్, మండల ఉపాధ్యక్షులు అవిశెట్టి కిరణ్ కుమార్,మండల ప్రధాన కార్యదర్శి బుశిపాక రమేష్, మండల నాయకులు MD.షాకిరుద్దీన్,నల్ల నరేష్,బుశిపాక నరేష్,మైనార్టీ నాయకులు అల్తాఫ్,ఆరోన్ ,అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ పెంపు రైతులకు ఊరట

- **బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య**

**మునుగోడు,జూలై 23(వెలుతురు):**



రబీ 2025–26 సీజన్‌కు తెలంగాణలో ధాన్యం సేకరణ అంచనాను 35 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య స్వాగతించారు. ఈ నిర్ణయం రాష్ట్ర రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం సేకరణ లక్ష్యాన్ని పెంచడం కేంద్ర ప్రభుత్వ రైతు అనుకూల విధానాలకు నిదర్శనమన్నారు.రైతు సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ పెంపుతో రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు మేలు జరుగుతుందని, పంట విక్రయంలో ఇబ్బందులు తగ్గి రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని జానయ్య ఆశాభావం వ్యక్తం చేశారు.

# హాస్టల్ వార్డెన్ల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

**మునుగోడు, జూలై 23 (వెలుతురు):**



మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్టళ్లలో సమయపాలన పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శశికళకు గురువారం వినతిపత్రం అందజేశారు.హాస్టల్ వార్డెన్లు విధులకు సమయానికి హాజరుకావడం లేదని, విద్యార్థులకు అందించాల్సిన మెనూను సక్రమంగా అమలు చేయడం లేదని, అవసరమైన వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.వినతిపత్రాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ, జిల్లా కోశాధికారి గోపగోని ఉదయ్ గౌడ్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారికి అందజేశారు.

# ఘనంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

**నూతనకల్ జూలై 23 ( వెలుతురు ):**



మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గోరుగంటి రామకిషన్ రావు, భూరెడ్డి సంజీవరెడ్డి,యువజన అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్,గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య, మండల కాంగ్రెస్ నాయకులు చురకంటి చంద్రారెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి,పగిళ్ళ అశోక్ రెడ్డి, బంటు బద్రి, గంగయ్య యాదవ్, చిర్ర శ్రీనాథ్ గౌడ్, మూడ్ మోహన్ నాయక్, కుమార్,బొల్లేద్దు నాగయ్య, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# రామన్నపేట నూతన సిఐగా మోలుగురి రవి బాధ్యతలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 23:**



పోలీస్ సర్కిల్ నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా మోలుగూరి రవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల డిటిసి నుంచి బదిలీపై వచ్చిన ఆయన ప్రజల సహకారంతో శాంతి పద్ధతులు పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. సమాజానికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ పనిచేసిన ఎన్. వెంకటేశ్వర్లు మల్టీ జోన్_ టూ కు బదిలీ అయ్యారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేసముద్రంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ధర్నా

- **ప్రశ్నించే గొంతులను తాళం వేస్తున్న కేంద్ర ప్రభుత్వం – ఎమ్మెల్యే డా. మురళీ నాయక్**
- **విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు – కేసముద్రం మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి**

**కేసముద్రం వెలుతురు జూలై 23:**





అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేసముద్రం మున్సిపాలిటీ అంబేద్కర్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నీట్ పేపర్ లీకేజీ ఘటనకు, ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా భారీ ధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మానుకోట ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని తీవ్రంగా విమర్శించారు. నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో వరుసగా జరుగుతున్న అవకతవకలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని అన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే గొంతులను తాళం వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల తరఫున నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.అనంతరం జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమైన విద్యార్థుల శ్రమ ఒక్క ఘటనతో వృథా కావడం బాధాకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు విద్యార్థుల్లో పరీక్షలపై నమ్మకాన్ని దెబ్బతీసి, వారి ఉన్నత విద్య లక్ష్యాలను ఆందోళనకరంగా మారుస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు పునరావృతం కాకుండా పరీక్షల నిర్వహణలో పారదర్శకత, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా బాధ్యులపై తగిన చర్యలు తీసుకుని, పరీక్షా వ్యవస్థపై విద్యార్థుల విశ్వాసాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు.

# నారగుట్టపై మైనింగ్ క్రషర్ ఏర్పాటును ప్రతిఘటించండి

- **జనావాసాల మధ్య క్రషర్ ప్రతిపాదన ఉపసంహరించకుంటే ప్రజా పోరు తప్పదు**
- **ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణలో ఐక్యత చాటండి**

**భువనగిరి వెలుతురు జూలై 23:**





గురువారం భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్ లో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నారగుట్టపై స్టోన్ క్రషర్ (మైనింగ్) ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వవద్దని పల్లెర్ల అంజయ్య అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ రౌండ్ సేపు సమావేశంలో వివిధ గ్రామాల ప్రముఖులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రైతులు వృత్తిదారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ భువనగిరి మండలంలోని గౌస్ నగర్, తుక్కాపూర్, ఎర్రంబల్లి, నమాత్ పల్లి, గ్రామాల మధ్యన ఉన్న నారగుట్టపై మైనింగ్ క్రషర్ ఏర్పాటును ప్రాతికటించాలని , జనావాసాల మధ్య క్రషర్ ప్రతిపాదన ఉపసంహరించకుంటే ప్రజా పోరు తప్పదని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వెంటనే దీనిని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనెల 28న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో ప్రజలు రైతులు కార్మికులు సమస్త ప్రజా సంఘాలు ఐక్యత చాటి రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.భువనగిరి మండలంలోని సర్వేనెంబర్ 119 , 139 లో ప్రభుత్వానికి చెందిన నారగుట్టపై 50 ఎకరాల విస్తీర్ణంలో మెసర్స్ ఆర్కె స్టోన్స్ ఇండస్ట్రీస్ కు మైనింగ్ కు అనుమతి ప్రతిపాదనలను తక్షణం రద్దు చేయాలని, ఈనెల 28 జరిగే ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని పేర్కొన్నారు.ప్రకృతి వారసత్వానికి, జీవ వైవిధ్యానికి భూగర్భ జలాల సంరక్షణకు, జంతువులకు, పక్షులకు, ఆవాసాలకు.ప్రతీకలైన నారగుట్టలను మైనింగ్ అప్పగించడం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణం సమతుల్యత దెబ్బ తింటుందని చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని,రైతుల వ్యవసాయం దెబ్బతిని, భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, ఈ గుట్టపై ప్రకృతి ఆయుర్వేద వనమూలికలు, మన సంపదకు ప్రమాదం వాటిల్లో పరిస్థితులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త నాగసేనారెడ్డి మాట్లాడుతూ. ప్రకృతిని కాపాడాలని పర్యావరణాన్ని పరిరక్షించకపోతే భవిష్యత్ తరాలు మనని క్షమించవని చెట్లు, గుట్టలను రక్షించుకో రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉన్నదని ప్రకృతిని విధ్వంసం చేయడం ద్వారా మానవ మనుగడకే ప్రమాదంగా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు.రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటలు బాలరాజు గౌడ్ మాట్లాడుతూ నారగుట్ట పరిసర గ్రామాల ప్రజలకు జీవనాధారంగా ఉందని, అనేక జీవవైవిధ్య పక్షి జాతులు, పండ్లు, సీతాఫలాలు, వన్యప్రాణులు వృత్తిదారులకు జీవన విధానంలో మమేకమైన సంపదని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో నమాత్ పల్లి సర్పంచ్ అతికం అరుణా లక్ష్మీనారాయణ గౌడ్ తుక్కాపురం మాజీ సర్పంచ్ నోముల మహేందర్ రెడ్డి, ప్రముఖ సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, ఎం సత్యనారాయణ వికలాంగుల సంఘం అధ్యక్షులు , బానోతు భాస్కర్ నాయక్, జి శ్రీనివాస్ చార్యులు , మాజీ ఎంపిటిసి నల్ల మాస సత్యనారాయణ, సిపిఐ నాయకులు దాసరి లక్ష్మయ్య,బత్తిని కుమార్ జిట్టా అంజిరెడ్డి భూషబోయిన నరసింహ ఏదునూరి మల్లేశం, గౌస్ నగర్ మాజీ ఉపసర్పంచ్ పాక వెంకటేశం ఏదు మేకల మహేష్, వినోద్, వి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్ మానవరాళ్ల పుష్పలంకరణలో పాల్గొన్న సమ్మిగౌడ్ చిలువేరు

- **పట్టు వస్త్రాలు అందజేసి చిన్నారులను ఆశీర్వదించిన సమ్మయ్య గౌడ్, సర్పంచ్ బాలాజీ రెడ్డి**

**కేసముద్రం వెలుతురు జూలై 23:**



కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్ కోడలు &కొడుకు శ్రీమతి మేడి అంజలి – శ్రీ మేడి యాకంభ్రం దంపతుల ఆహ్వానం మేరకు, మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్ మనవరాళ్లు శ్రీనిధి, నిత్యశ్రీల పుష్పాలంకరణ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా చిన్నారులను ఆశీర్వదించి, వారు విద్యలో, సంస్కారంలో, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారులకు ఆశీస్సులు అందించి, మేడి కుటుంబ సభ్యులకు పట్టు వస్త్రాలను అందజేసి అభినందనలు తెలిపి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పుష్పాలంకరణ వంటి సాంప్రదాయ కార్యక్రమాలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఇటువంటి వేడుకలను ప్రతి కుటుంబం ఆదరించి కొనసాగించాలని సూచించారు. చిన్నారులు మంచి విద్యతో పాటు సంస్కారవంతులుగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాలాజీ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగెల్లి శ్రీనివాస్, శ్రీరామ్ రెడ్డి ,మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, ఆహ్వానితులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

**మునుగోడు,జూలై 23(వెలుతురు):**







మండలంలోని కల్వకుంట్ల గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం మండల విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఈఈ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడుతూ, మూడేళ్లుగా లూజు విద్యుత్ లైన్లు, దెబ్బతిన్న స్తంభాలు, తరచూ విద్యుత్ అంతరాయాలపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. లింగాల శ్రీనివాస్‌రెడ్డి ఇంటి నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిదీపాలను మార్చాలని కోరారు. ఏ ఈ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడం, ఫోన్ చేసినా స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.గ్రామంలోని విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే గ్రామస్తులతో కలిసి విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు చికురి బిక్షం, 1పగిళ్ల యాదయ్య,డివైఎఫ్ఐ నాయకులు కట్ట ఆంజనేయులు,కుక్కల మహేష్,జిక్కి తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి తీరుపై కాంగ్రెస్ నిరసన

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 23:**

విద్యార్థుల పక్షాన పోరాడుతున్న రాహుల్ గాంధీ అరెస్ట్ ను ఖండిస్తూ రామన్నపేట లో కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమం లో పాల్గొన్న జిల్లా నాయకులు పూస బాలకిషన్ ( నీట్ ) ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ని కేంద్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, రామన్నపేట పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో



నిర వ్హించిన శాంతియుత నిరసన కార్యక్రమ ంలో యాదాద్రి భువనగిరి జిల్లా నాయకులు పూస బాలకిషన్ పాల్గొన్నారు. బాలకిషన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై గొంతెత్తుతున్న ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి నిర్బంధ చర్యలను వెంటనే విరమించుకుని ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు.

# దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకం

- **బి.ఎం.ఎస్.ఆర్.యు. రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్**

**కరీంనగర్ వెలుతురు జూలై 23:**



కార్మిక శక్తియే నిజమైన జాతీయ శక్తి అని, కార్మికులంతా అంకితభావంతో, దేశభక్తితో విధులను నిర్వర్తించాలని భారతీయ వైద్య విక్రయ ప్రతినిధుల యూనియన్ (బి.ఎం.ఎస్.ఆర్.యు.) రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ పిలుపునిచ్చారు.బి.ఎం.ఎస్. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ నగర్ కూడలిలో బి.ఎం.ఎస్.ఆర్.యు. ఆధ్వర్యంలో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు పప్పుల సురేష్ జెండా ఆవిష్కరించి, యూనియన్ సిద్ధాంతాలను కార్యకర్తలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో కార్మిక వర్గం పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. ఏ రంగానికి చెందిన కార్మికులైనా దేశభక్తితో పనిచేస్తేనే ఆ అభివృద్ధి ఫలాలు సమాజానికి అందుతాయన్నారు."దేశం బాగుంటే పరిశ్రమ బాగుంటుంది, పరిశ్రమ బాగుంటే కార్మికుడు బాగుంటాడు" అనే చక్రంలా ఈ వ్యవస్థ సాగుతుందని, అప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని వివరించారు.రాజకీయాలకు అతీతంగా, ప్రత్యేక సిద్ధాంతాలతో పనిచేస్తున్న భారతీయ కార్మిక సంఘం (బి.ఎం.ఎస్.) ప్రపంచంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా అవతరించిందని పేర్కొన్నారు. ఇటువంటి గొప్ప సంఘంలో కార్యకర్తలుగా కొనసాగడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎం.ఎస్. జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్, కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, బి.ఎం.ఎస్.ఆర్.యు. జిల్లా నాయకులు ఆముదుర్తి రవి, క్యాతం శ్రీనివాస్, నల్ల నవీన్, గోవిందుల సతీష్, మాదాసు విక్రమ్, వెంకటరమణ, సుల్తాన్, నక్క అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి

- **ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్యంపై దాడి : పీడీఎస్‌యూ**

**జహీరాబాద్ వెలుతురు జూలై 23:**

నీట్ (NEET) పేపర్ లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఢిల్లీలో సీజేపీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జి చేయడం, భాష్పవాయు గోళాలు ప్రయోగించడం హేయమైన చర్య అని ఖండిస్తూ జహీరాబాద్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో పీడీఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది నీట్ విద్యార్థుల భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గత 13 సంవత్సరాలుగా దేశ విద్యా వ్యవస్థను బలహీనపరుస్తూ, విద్యా నియంత్రణ సంస్థలను రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు.నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దీనిపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, విద్యావేత్తలు ఆందోళనలు చేపట్టినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న వారిపై పోలీసు బలగాలతో దాడులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.దేశంలో విద్యా వ్యవస్థను పరిరక్షించాలని, పరీక్షల నిర్వహణలో పారదర్శకత తీసుకురావాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి నాయకులపై దాడులు చేయడం ద్వారా ప్రశ్నించే గొంతులను అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను, విద్యార్థుల ఆందోళనలను వినాల్సిన పాలకులు అణచివేత ధోరణి అవలంబించడం సమంజసం కాదన్నారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థి నాయకులతో చర్చలు జరిపి, నీట్




పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి ఈ. గోపాల్‌తో పాటు నాయకులు రాకేష్, సురేష్, సునీల్, జహీర్, చలావుద్దీన్, ఆకాష్, మీనాక్షి, సరోజ, సప్న, నవీన్, నరేందర్, ప్రశాంత్, అశ్విని, కుమార్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# SIR ప్రక్రియలో నిర్లక్ష్యం వద్దు.. ప్రతి అర్హ ఓటరికి న్యాయం జరగాలి

- **మొగుడంపల్లి మండలంలో BLAలతో సమీక్ష సమావేశం**
- **ఇంటింటికీ వెళ్లి ఓటరు అవగాహన కల్పించాలని పిలుపు**
- **మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్‌చార్జ్ డా. ఏ. చంద్రశేఖర్**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 23:**



సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో BLAలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, జహీరాబాద్ ఇన్‌చార్జ్ డా. ఏ. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా–జగ్గారెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ వార్‌రూమ్ కో–ఆర్డినేటర్ జూలూరి ధనలక్ష్మి , జహీరాబాద్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్ పాల్గొని SIR ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రతి బూత్‌లో జరుగుతున్న ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా BLAలు బాధ్యతాయుతంగా పనిచేయాలని డా. చంద్రశేఖర్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించే బాధ్యతను పార్టీ శ్రేణులు, BLAలు సమన్వయంతో నిర్వర్తించాలని, ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ SIR కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పవన్ రాథోడ్, భాస్కర్ రెడ్డి, ఉదయ్ శంకర్ పాటిల్, జహీరాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, మాజీ మండల అధ్యక్షుడు మాక్సూద్ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు కండేం నర్సింలు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, సర్పంచులు, BLAలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అవసరమైతే దీన్ని ఇంకా పత్రికా శైలిలో మరింత పదునైన భాషతో కూడా సిద్ధం చేయగలను.

# ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాజకీయ డ్రామాలు మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి...

- **బిజెపిశంకరపట్నం మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ ...**

**శంకరపట్నం వెలుతురు జూలై 23:**

మానకొండూరు శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ తీరుపై బీజేపీ శంకరపట్నం మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి రాజకీయ ప్రదర్శనలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలను గాలికొదిలి రాజకీయ డ్రామాలు చేయడం తగదని అనిల్ హితవు పలికారు. ఈ సందర్భంగా మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లిని పలు కీలక స్థానిక సమస్యలపై ఆయన నిలదీశారు.శంకరపట్నం మండల ప్రజలకు అత్యంత కీలకమైన ఆర్కండ్ల వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చి ఏమైంది? ప్రతి వర్షాకాలంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులు మీకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో పారదర్శకత లోపించిందని, ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలను పూర్తి పారదర్శకతతో నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఉపయోగపడే అరుంధతి ఫంక్షన్ హాల్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. నల్లవెంకటపల్లి – కేశవపట్నం రహదారి పనులు అసంపూర్తిగా ఉండటంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మీ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని, ప్రస్తుతం రైతులు వర్షాభావం, సాగునీటి సమస్యలతో ఆందోళన చెందుతుంటే..కాలువల ద్వారా నీటి సరఫరా, రైతులకు భరోసా కల్పించడం, క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించడం మీ బాధ్యత కాదా? అని నిలదీశారు.



**బహిరంగ చర్చకు సవాల్**

“మీకు నిజంగా ప్రజలపై నమ్మకం ఉంటే... మానకొండూరు నియోజకవర్గ అభివృద్ధి, ఎన్నికల హామీల అమలు, శంకరపట్నం మండల సమస్యలపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు రండి. బీజేపీ సిద్ధంగా ఉంది, మీరు సిద్ధమేనా?” అని ఏనుగుల అనిల్ సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో శంకరపట్నం మండల ప్రజలకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, ఇతర హామీల అమలుపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా చిరంజీవి ఎన్నిక

**వెలుతురు నారాయణఖేడ్ జూలై 23 :**



సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సంగారెడ్డి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి మరియు రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కన్వీనింగ్ కమిటీని ప్రకటించారు.ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా చిరంజీవిని ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా లక్ష్మణ్, మోష, బోరంచ గణేష్, షోయల్ రాజేష్, శోభలను నియమించారు.ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్‌గా ఎన్నికైన చిరంజీవి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో జిల్లాలో ప్రజా సమస్యలు, కార్మికుల సమస్యలు, రైతుల సమస్యలు మరియు అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేసి, సంస్థాగతంగా మరింత విస్తరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



**ఇట్లు, చిరంజీవి జిల్లా కన్వీనర్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, సంగారెడ్డి జిల్లా**

# విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందిస్తున్న శాన్వి జూనియర్ కళాశాల & డిఫెన్స్ అకాడమీ

**నగర మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూలై 23:**

ప్రస్తుత సమాజంలో విద్య కేవలం వ్యాపారంగా మారుతున్న తరుణంలో, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందిస్తూ దేశ సేవ చేసే దిశగా తీర్చిదిద్దుతున్న శాన్వి జూనియర్ కళాశాల & డిఫెన్స్ అకాడమీ అభినందనీయమని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు."Come to Learn – Go to Serve (నేర్చుకోవడానికి రండి... సేవ చేయడానికి వెళ్లండి)" అనే స్ఫూర్తిదాయక నినాదంతో యువతను సైన్యం, రక్షణ రంగం మరియు సామాజిక సేవ వైపు ప్రోత్సహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.శాన్వి జూనియర్ కళాశాల & డిఫెన్స్ అకాడమీ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర ఎంతో కీలకమని తెలిపారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త అరెశెట్టి మునిందర్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. వందలాది మంది విద్యార్థులను దేశానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఆయన చేస్తున్న కృషి సమాజానికి ఆదర్శమని కొనియాడారు.అనంతరం మేయర్ తన విద్యార్థి దశలో ప్రభుత్వ పాఠశాలలో చదివిన




రోజుల అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ఎన్ఎస్ఎస్ (NSS), ఎన్‌సీసీ (NCC) కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్న విషయాలను వివరిస్తూ, తన గురువులు మధుసూదన్ రెడ్డి, గోపీకృష్ణ గారి మార్గదర్శకత్వంలో నిర్వహించిన రక్తదాన శిబిరాలు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు తన జీవితానికి ఎంతో ప్రేరణగా నిలిచాయని తెలిపారు.2009లో అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన లూమ్లాలో మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలో నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరం (National Integration Camp) లో పాల్గొన్న అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. అలాగే అండమాన్ నికోబార్, లక్షద్వీప్, కార్గిల్ వంటి ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా భారత వైవిధ్యం, జాతీయ సమైక్యత, దేశభక్తి విలువలను ప్రత్యక్షంగా అనుభవించిన విషయాలను వివరించారు.విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలంటే కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణతో ముందుకు సాగడం అత్యంత ముఖ్యమని మేయర్ సూచించారు. పట్టుదలతో శ్రమిస్తే సాధించలేనిది ఏదీ ఉండదని అన్నారు.శాన్వి జూనియర్ కళాశాల అందిస్తున్న ఈ విలువైన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, కరీంనగర్ నగరానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ కళాశాల యాజమాన్యానికి, కార్యక్రమ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ అభివృద్ధికి కేంద్రం దృష్టి.. అశ్విని వైష్ణవ్‌కు బీఆర్ఎస్ నేతల వినతిపత్రం

- **రేక్ పాయింట్, బుల్లెట్ ట్రైన్ స్టాప్, పారిశ్రామికాభివృద్ధికి కీలక ప్రతిపాదనలు...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 23:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం అందించాలని కోరుతూ పార్లమెంటరీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార ప్రసారాలు, ఎలక్ట్రానిక్స్ & ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.జహీరాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే రేక్ పాయింట్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్–ముంబై హైస్పీడ్ (బుల్లెట్ ట్రైన్) కారిడార్ డీపీఆర్‌లో జహీరాబాద్‌ను చేర్చి బుల్లెట్ ట్రైన్ స్టాప్ మంజూరు చేయాలని వారు కోరారు. రేక్ పాయింట్ ఏర్పాటుతో వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల రవాణా సులభమై రైతులు, వ్యాపారులు, పరిశ్రమలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.నిమ్జ్, ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వంటి భారీ ప్రాజెక్టుల నేపథ్యంలో జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ స్టాప్ అత్యవసరమని, దీంతో



పెట్టుబడులు, ఉపాధి, లాజిస్టిక్స్ రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

# వర్షాభావంలో రైతు వేదనను ప్రతిబింబించిన విద్యార్థుల గీతం

- **ది స్మార్ట్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పాట విడుదల....**
- **విద్యార్థుల సృజనాత్మకతను ప్రశంసించిన ఎంఈవో జాకీర్ హుస్సేన్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 23:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ది స్మార్ట్ స్కూల్ ఆధ్వర్యంలో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలను హృదయాన్ని హత్తుకునేలా ప్రతిబింబించే ప్రత్యేక గీతాన్ని రూపొందించి గురువారం ఘనంగా విడుదల చేశారు. పాఠశాల కరస్పాండెంట్ హన్నాన్ జావీద్, ప్రిన్సిపాల్ బి. ప్రకాష్ ఆధ్వర్యంలో రూపొందిన ఈ పాటను మండల విద్యాశాఖ అధికారి (ఎంఈవో) జాకీర్ హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొని విడుదల చేశారు.ఈ సందర్భంగా ఎంఈవో జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, వర్షాభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విద్యార్థులు ఎంతో భావోద్వేగంతో, కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలతో పాటు విద్యా



రంగంలోనూ విద్యార్థులు రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.పాఠశాల కరస్పాండెంట్ హన్నాన్ జావీద్ మాట్లాడుతూ, రైతుల నిజ జీవిత వేదనను సమాజానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ గీతాన్ని రూపొందించినట్లు తెలిపారు. రైతుల సమస్యలపై విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు సురేందర్, ది స్మార్ట్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులతో పలు అభివృద్ధి పనులతో పాటు మరియు SIR పై చర్చిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు భీమ లక్ష్మణ్ ముదిరాజ్



**చేర్యాల మండలం వెలుతురు జూలై 23:**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న SIR (Special Intensive Revision) ప్రక్రియ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం నాగపురి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలు (BLAలు) మరియు పార్టీ కార్యకర్తలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన పలు మంది పార్టీ నాయకులతో ఫోన్‌లో మాట్లాడి, SIR ప్రక్రియ చివరి దశకు చేరుకుంటున్న నేపథ్యంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఓటరు తమ ఓటు నమోదు, ధృవీకరణ పూర్తయ్యేలా కృషి చేయడంతో పాటు, ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.అలాగే, SIR ప్రక్రియలో ఎదురయ్యే ఎలాంటి సందేహాలు లేదా సమస్యలైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.బీజేపీ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్న ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, అలాంటి ప్రయత్నాలను సమిష్టిగా తిప్పికొట్టాలని ఆయన అన్నారు. ప్రతి ఓటును కాపాడుకోవడం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలందరి బాధ్యత అని పేర్కొన్నారు.బీఎల్ఏలు, పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని భీమ లక్ష్మణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.

# ఏఎమ్ఎస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్



**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**

హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గురువారం రోజున ఏ ఎమ్ ఎస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా DM&HO గారు హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, లాబొరేటరీ కేంద్రాన్ని, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గర్భిణీల స్త్రీల సంరక్షణ, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు నియంత్రణ, జూలై నెల డెంగ్యూ మాసమైనందు వలన మలేరియా, డెంగీ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని, అలాగే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించి, ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములో వైద్యాధికారి మరియు సిబ్బంది హాజరైనారు.

# ఖమ్మం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సేవా పథకం అందుకున్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సయ్యద్ అమీర్ అలీ...

**ఖమ్మం వెలుతురు జూలై 23:**

ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం పెద్ద మునగాల గ్రామానికి చెందిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సయ్యద్ అమీర్ అలీకి రాష్ట్ర ప్రభుత్వం అందించే సేవా పథకం పురస్కారం ఖమ్మం పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన అమీర్ అలీ చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని అలవర్చుకుని, తండ్రికి తోడ్పడుతూ డిగ్రీ విద్యను పూర్తి చేశారు. అనంతరం 1984లో పోలీస్ శాఖలో కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.42 సంవత్సరాల పాటు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించిన ఆయన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో కోర్టు రైటర్, సీసీఎస్, ట్రాఫిక్ తదితర కీలక విభాగాల్లో సేవలందించారు. తన కృషి, అంకితభావంతో ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి ఎస్ఐగా పదోన్నతి పొందారు. పోలీస్ శాఖకు అందించిన విశిష్ట సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సేవా పథకం పురస్కారానికి ఎంపిక చేయగా, ఖమ్మం పోలీస్ కమిషనర్ ఆ పురస్కారాన్ని అందజేసి అమీర్ అలీ సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, తోటి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది అమీర్ అలీని ఘనంగా అభినందిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# హిమాయత్‌నగర్ డివిజన్‌లో మహాలక్ష్మి రామన్ గౌడ్ పర్యటన

**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**



హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ డివిజన్ పరిధిలోని కింగ్‌కోటి ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన మహాలక్ష్మి రామన్ గౌడ్, జలమండలి మేనేజర్ మున్నవర్‌ను ఘటనాస్థలానికి పిలిపించి సమస్యలను వెంటనే పరిశీలించి, తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, జాకీ, సోహెల్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్‌నినోపై జిల్లాల వారీగా వచ్చిన సూచనలతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి ముఖ్యమంత్రికి అందజేస్తాం : మంత్రి తుమ్మల

- **వచ్చే నెలల్లోనూ ఎల్-నినో ప్రభావం కొనసాగుతుంది.. రైతులు వరి సాగుపై పునరాలోచించాలి : మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, వెలుతురు జూలై 23:**

ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, రాష్ట్ర కేబినెట్‌లో చర్చించిన విధంగా ఉమ్మడి జిల్లాల వారీగా ఎల్–నినో కంటింజెన్సీ ప్రణాళికపై ఇంచార్జి మంత్రుల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు నిర్వహించినట్లు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొని ఆయా జిల్లాల పరిస్థితులకు అనుగుణంగా పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆ సూచనలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి రాష్ట్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముఖ్యమంత్రి గారికి అందజేయనున్నట్లు వెల్లడించారు.గురువారం సచివాలయంలో జిల్లాల వారీగా వచ్చిన సూచనలు, ప్రస్తుత ఎల్–నినో పరిస్థితులు, రానున్న నెలల్లో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు మరియు ఎక్స్పర్ట్ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ ఎండీ యాస్మిన్ బాషా, TGNPDCL MD కర్నాటి వరుణ్ రెడ్డి, భారత వాతావరణ శాఖ (IMD), ఇక్రిశాట్, క్రిడా, ఐఐఎంఆర్, ఎస్.ఎల్.బి.సి, నాబార్డు, నేషనల్ సీడ్ కార్పొరేషన్ తదితర సంస్థల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం వచ్చే నెలలో కూడా ఎల్–నినో పరిస్థితులు కొనసాగనున్నాయని, సెప్టెంబర్ నాటికి దాని తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, డిసెంబర్ నాటికి తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌పై కూడా దీని ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు.మహారాష్ట్ర, కర్ణాటక వంటి ఎగువ రాష్ట్రాల్లో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాకపోవడంతో అక్కడి నుంచి గోదావరి, కృష్ణా నదులకు పెద్దఎత్తున వరదలు వచ్చే అవకాశాలు కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని, ఒకటి రెండు జిల్లాలు మినహా ఎక్కడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని తెలిపారు. గత రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగు చేయాలని నిర్ణయించుకోవద్దని స్పష్టం చేశారు.భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్నాయని, బోరుబావుల కింద కూడా వరి సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటి అవసరాలకే సరిపోయే పరిస్థితి ఉందని, ప్రతి జిల్లాలోని ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వ సామర్థ్యంపై మండలాల వారీగా రైతులకు నిరంతరం సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.కొంతమంది రైతులు ఇంకా వర్షాలు పడతాయనే ఆశతో వరి సాగు చేయాలని భావిస్తున్నారని, వారికి వాస్తవ పరిస్థితులను పూర్తిగా వివరించి ఎలాంటి నష్టాలు జరగకుండా అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గత వర్షాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో దాదాపు 23 శాతం మేర సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిన విధంగానే ప్రతి మండలానికి, ప్రతి గ్రామానికి కూడా ప్రత్యేక అధికారులను నియమించే అంశంపై కలెక్టర్లతో చర్చించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు మంత్రి సూచించారు. ఈ అధికారులు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయిలో రైతులందరికీ ఎల్–నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి లభ్యత, ప్రభుత్వ సూచనలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ సంవత్సరం 58 వేల కోట్ల రుణాన్ని లక్ష్యంగా పెట్టుకొని, ఇప్పటి వరకు 20 వేల కోట్లు రైతులకు రుణాలుగా అందించామని బ్యాంకు అధికారులు తెలిపగా.. రైతులకు ఇచ్చే పంట రుణాలను పెంచాలని బ్యాంకులకు మంత్రి సూచించారు. మైక్రో ఇరిగేషన్ కింద రైతులకు మరింత రుణ సహాయం అందించాలని నాబార్డును కోరారు. RIDF కింద నాబార్డు అందించే 498 కోట్లను తెచ్చుకునేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసి ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ కి అందించాలని ఉద్యానశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో రైతులకు అవసరమైన డ్రిప్, స్ప్రింక్లర్లను సబ్సిడీపై అందించే అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతులకు అందించే రుణాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. డ్రిప్ పరికరాలు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే రైతు వేదికలను విత్తనాల పంపిణీ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. అవసరమైతే నేషనల్ సీడ్ కార్పొరేషన్ నుంచి విత్తనాలు తెప్పించాలని, ఆ సంస్థ విత్తనాలపై 50 శాతం వరకు సబ్సిడీ అందించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించారు.ముఖ్యంగా



హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాలు అయిన రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్ నగర్, భువనగిరి, నల్లగొండ జిల్లాల ప్రాంతాల రైతులకు కూరగాయగాల సాగు చేపట్టేలా అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటికే వేసిన పంటలను ఏ విధంగా రక్షించుకోవాలో రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించాలని అగ్రికల్చర్ శాస్త్రవేత్తలను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఎక్కువగా నీటి సంరక్షణకు సంబంధించిన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఎల్–నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు నష్టాలు తగ్గించే దిశగా ప్రతి చర్యను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

### జిల్లాల వారీగా వచ్చిన సూచనలు

ఉమ్మడి జిల్లాల్లో నిర్వహించిన సమీక్షా సమావేశాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు పలు ఆచరణాత్మక సూచనలు చేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక కంటింజెన్సీ ప్రణాళికలు రూపొందించడం, వర్షపాతం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రాంతానుకూలంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటలను ప్రోత్సహించడం, నీటి పొదుపు పద్ధతులు, సూక్ష్మ సేద్యం విస్తరణ, భూగర్భ జలాల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, చెరువుల పూడికతీత, ఫార్మ్ పాండ్లు, చెక్‌డ్యాంల నిర్మాణం, నేల తేమ సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.అదేవిధంగా ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, ఎరువులు ముందుగానే అందుబాటులో ఉంచడం, రైతు వేదికల ద్వారా విత్తనాల పంపిణీ, నేషనల్ సీడ్ కార్పొరేషన్ నుంచి అవసరమైన విత్తనాలు సమకూర్చడం, రైతులకు వాతావరణ ఆధారిత శాస్త్రీయ సలహాలను ఎప్పటికప్పుడు అందించడం, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. జలాశయాల నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిపై రైతులకు నిరంతరం సమాచారం అందించడం, పశుగ్రాసం, పశువైద్య సేవలను సిద్ధంగా ఉంచడం, జిల్లా, మండల స్థాయిలో పర్యవేక్షణ కమిటీలు, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని కూడా సూచనలు వచ్చాయని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇప్పటికే శాఖల వారీగా సమీక్షలు నిర్వహించామని తెలిపారు. జిల్లాల వారీగా వచ్చిన సూచనలన్నింటినీ సమగ్రపరచి రాష్ట్ర స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముఖ్యమంత్రికి సమర్పించనున్నట్లు చెప్పారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం

- **గ్రామంలో ప్రతి రైతుకు న్యాయం చేస్తాం**

**కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీ మంకాల శేఖర్ రెడ్డి**

**ఇబ్రహీంపట్నం వెలుతురు జులై 23:**



ఇబ్రహీంపట్నం మండల పరిధి లోని ఎలిమినేడు గ్రామానికి చెందిన రైతులు కాంగ్రెస్ పార్టీ నా యకులు గురువారం రోజున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బా బు ని కలిసి ఎలిమినేడు గ్రామంలో ఉన్నటువంటి 512 166 412 సర్వే నెంబర్లలో ఉన్నటు వంటి సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ఎలిమినేడు గ్రామంలో ఉన్నటువంటి సమస్యను వెంబడే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నీ కోరా రు ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తది తరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జి మీనాక్షి నటరాజన్ గారి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**



గురువారం రోజున మీనాక్షి నటరాజన్ బర్త్డే సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఉద్యానవనములో మొక్కలు నాటి నటరాజన్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పిడమర్తి రవి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్ గౌడ్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో నక్క మహేష్ దేవరకొండ నరేష్ ఎస్.కె రహీం మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో ఘనంగా దర్గా చిన్న గౌడ్ పైల్వాన్ జన్మదిన వేడుకలు..



**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**



హైదరాబాద్ దర్గా చిన్న గౌడ్ ఫైల్ మాన్ జన్మదిన వేడుకలు గచ్చిబౌలిలోని తన నివాసంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో అభిమానులు భారీ ఎత్తున హాజరై చిన్నబాయి కి గజమాలతో బాన సంచాలు కాల్చి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం దర్గా చిన్న గౌడ్ పైల్వాన్ మాట్లాడుతూ నా అభిమానుల ఆప్యాయతలు ఎల్లప్పుడూ నాకు ఇలాగే ఉండాలని నా జన్మదిన వేడుకకు హాజరైన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా అని దర్గా పైల్వాన్ అన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్‌లో ఉత్సాహంగా స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికలు

**ఎన్నికల ప్రక్రియను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**

**కూకట్ పల్లి జూలై 23 వెలుతురు:**



కూకట్‌పల్లి రామాలయం గుడి సమీపంలోని శ్రీ చైతన్య స్కూల్, శాంతినగర్ బ్రాంచ్‌లో స్టూడెంట్ క్యాబినెట్ ఎన్నికలు గురువారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మృణాళిని ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియను మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇటువంటి ఎన్నికలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ఎన్నికల ప్రక్రియను పాఠశాల యాజమాన్యం క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన విద్యార్థులు తమ ఆలోచనలు, కార్యాచరణ ప్రణాళికలను సహ విద్యార్థులకు వివరించగా, విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఓట్ల లెక్కింపు అనంతరం విజేతలుగా ఎన్నికైన విద్యార్థులు పాఠశాల అభివృద్ధి, క్రమశిక్షణ, పరిశుభ్రత, విద్యార్థుల సంక్షేమం వంటి అంశాల్లో బాధ్యతాయుతంగా పనిచేసి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పద్మజ, రాజేష్, చారి, జాహ్నవి, భరత్, శాస్త్రికతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లా గణేష్ నేత

- **బీఎల్‌వోలకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న నాయకులు**

**కూకట్‌పల్లి, జూలై 23 వెలుతురు:**

ఎస్ఐఆర్ (Special Intensive Revision) ఓటరు నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేష్ నేత సూచించారు. గురువారం శంశిగూడ ఎల్లమ్మబండ పరిధిలోని పలు కాలనీల్లో జరుగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను ఆయన బీఎల్‌వోలు, బీఎల్ఏలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్న జిల్లా గణేష్ నేత, ప్రతి ఇంటిని అధికారులు తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఒకవేళ ఇంటి సభ్యులు అందుబాటులో లేకపోతే ఇంటి యజమానులతో మాట్లాడి, అద్దెదారుల వివరాలు, ఫోన్ నంబర్లు సేకరించాలని, అవసరమైతే కాలనీ వెల్ఫేర్ సంఘాల ప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్న ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఓటరు నమోదు ప్రక్రియకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా అధికారులు లేదా కాంగ్రెస్ నాయకులను సంప్రదించాలని సూచించారు. బీఎల్‌వోలకు విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.



కార్యక్రమంలో స్థానిక బీఎల్‌వోలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థ నిర్వీర్యంపై విద్యార్థి లోకం తిరగబడాలి...

**జూలై 24 తెలంగాణ రాష్ట్ర విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి:తెలంగాణ రాష్ట్ర NSUI నాయకుడు గొల్ల జాన్**

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 23:**



భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు వెన్నెముకైన విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి విద్యార్థి లోకం కదనరంగంలోకి దిగాల్సిన సమయం ఆసన్నమైందని ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల జాను పిలుపునిచ్చారు.దేశంలో విద్యా వ్యవస్థ రోజురోజుకూ నిర్వీర్యమవుతోంది. రాత్రింబవళ్లు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల భవిష్యత్తుతో వరుస పేపర్ లీకేజీల ద్వారా చెలగాటమాడడం అత్యంత బాధాకరమన్నారు. విద్యార్థుల ఆందోళనలకు సమాధానం ఇవ్వాల్సిన పాలకులు, ప్రశ్నించిన విద్యార్థులపై ఢిల్లీలో లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం అన్నారు. విద్యారంగానికి తగిన ప్రాధాన్యత, నిధులు కల్పించకుండా విద్యార్థుల ప్రయోజనాలను నిర్లక్ష్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం.విద్యార్థుల హక్కులను పరిరక్షించడం, విద్యా వ్యవస్థను కాపాడడం, విద్యార్థుల భవిష్యత్తును రక్షించడం కోసం NSUI, SFI, AISF, PDSU, AIFDS, AISB, AIPSU, BGVS తదితర విద్యార్థి సంఘాల సంయుక్త పిలుపు మేరకుజూలై 24 (శుక్రవారం) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న "విద్యాసంస్థల బంద్" కు మేధావులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యను కాపాడుకుందాం...విద్యార్థుల భవిష్యత్తును రక్షిద్దాం...జూలై 24 తెలంగాణ విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పనులపై కుత్బుల్లాపూర్ జోన్ ఇంజనీరింగ్ శాఖా ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమీక్ష సమావేశం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 23:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో సుమారు రూ.20 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పేట్ బషీరాబాదు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో నియోజకవర్గంలోని రహదారుల నిర్మాణం, విద్యుత్ సేవలు, పారిశుధ్య నిర్వహణ, పార్కుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, అలాగే పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు.ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అభివృద్ధి పనిని నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఈసమీక్ష సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కార్పొరేట్ సంస్థలకు దీటుగా గురుకులాలు

- **స్పష్టం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్**

రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకుల విద్యాసంస్థలను ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని రీతిలో అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ రాష్ట్ర సాంఘిక, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ విద్యాసంస్థను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల బోధనా ప్రమాణాలు, వసతి గృహాలు, పారిశుధ్యం, భోజన వసతులు మరియు విద్యా వాతావరణాన్ని క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు.తనిఖీ అనంతరం కొత్తగా చేరిన విద్యార్థులకు 11 రకాల నిత్యావసర వస్తువులతో కూడిన 'వెల్‌కమ్ కిట్ల'ను మంత్రి పంపిణీ చేశారు. ఈ కిట్‌లో ప్లేటు, గ్లాసు, గిన్నె, కప్పు, స్పూను, బెడ్‌షీట్, టవల్, బ్లాంకెట్, షూస్, సాక్స్ మరియు స్కూల్ బ్యాగ్ ఉన్నాయి. అలాగే జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదరికం అనేది ఏ ఒక్కరి ప్రతిభకు లేదా ఎదుగుదలకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలను ఉచితంగా అందిస్తోందని స్పష్టం చేశారు.చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న డైట్ ఛార్జీలను ప్రస్తుత ప్రభుత్వం గణనీయంగా పెంచిందని మంత్రి అడ్లూరి గుర్తుచేశారు. దీనివల్ల గురుకులాల్లో చదువుకునే



విద్యార్థులకు రోజూ బలవర్ధకమైన, పౌష్టికాహారాన్ని అందించడం సాధ్యమవుతోందన్నారు. సరైన పోషకాహారం లభించడం వల్ల పిల్లల్లో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఏకాగ్రత, చదువుపై శ్రద్ధ పెరుగుతాయని, ఇది వారి విద్యా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు దేశంలోనే అత్యుత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు. సంక్షేమ వసతి గృహాలను కేవలం నివాస కేంద్రాలుగా కాకుండా, ప్రతిభను వెలికితీసే విజ్ఞాన నిలయాలుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని గురుకుల విద్యార్థులు కేవలం వార్షిక పరీక్షల్లోనే కాకుండా, నీట్, జేఈఈ , ఈఏమ్‌సెట్ వంటి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో అద్భుతమైన ర్యాంకులు సాధిస్తున్నారని మంత్రి ప్రశంసించారు.

## నేడే మొకిలలో వానాకాలం అత్యవసర పంటల ప్రణాళికపై అవగాహన సదస్సు

**శంకర్‌పల్లి, వెలుతురు జూలై 23 :**

ప్రస్తుత 2026 వానాకాలం సీజన్‌లో ఎల్–నినో ప్రభావం చూపే అవకాశం ఉన్న నేపథ్యంలో, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు శంకర్‌పల్లి మండలంలో ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు ఉదయం 11:00 గంటలకు మండల పరిధిలోని మొకిల గ్రామంలో గల 'రైతు వేదిక' భవనంలో ఈ మండల స్థాయి అత్యవసర పంటల ప్రణాళిక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమానికి మండలంలోని రైతులు, వ్యవసాయ శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు హాజరుకానున్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, డిప్యూటీ సర్పంచులు, వార్డు సభ్యులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వివరాలను ఈ సదస్సులో వ్యవసాయ అధికారులు వివరించనున్నారు. కావున మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతాంగం మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, ఈ అవగాహన సదస్సును విజయవంతం చేయాలని శంకర్‌పల్లి మండల వ్యవసాయ అధికారి చైతన్య ఒక ప్రకటనలో కోరారు.



## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: డా. కె ఆనంద్

- **జవహర్‌నగర్ పీహెచ్‌సీలో డీఎంహెచ్‌ఓ తనిఖీ**

**మేడ్చల్, జూలై 23 (వెలుతురు):**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. ఆనంద్ జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. తనిఖీ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ విజయ్ చంద్ర వరుసగా విధులకు గైర్హాజరు కావడం, సేవల పట్ల అశ్రద్ధ చూపడంపై డీఎంహెచ్‌ఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం టీబీ మొబైల్ ఎక్స్–రే యూనిట్ పనితీరును, ఫార్మసీలోని ఔషధ నిల్వలను ఆన్‌లైన్ (ఈ–ఔషధి) మరియు మాన్యువల్ రిజిస్టర్లతో సరిపోల్చారు. గడువు ముగిసే ఔషధాల కోసం ప్రత్యేకంగా "నియర్ ఎక్స్‌పైరీ డ్రగ్ కార్నర్" ఏర్పాటు చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఆప్యాయంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రతి ఉద్యోగి బాధ్యత అని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని, సిబ్బంది క్రమశిక్షణ, యూనిఫాం, పరిసరాల పరిశుభ్రత కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.



# భాగ్యనగరంలో పేదలకు 'ఇందిరమ్మ టవర్స్'

**హైదరాబాద్, వెలుతురు జూలై 2026:**

హైదరాబాద్ మహానగరంలో సొంత ఇల్లు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద మరియు దిగువ మధ్యతరగతి కుటుంబాలకు శాశ్వత గృహ భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నగరంలో నివసిస్తున్న పేదలకు గౌరవప్రదమైన రీతిలో, అందుబాటు ధరల్లో అత్యాధునిక 'ఇందిరమ్మ టవర్స్' నిర్మించి అందించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, దరఖాస్తుల స్వీకరణ, అమలు విధానంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నగరంలో అత్యంత విలువైన కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను వ్యాపార ప్రయోజనాలకు కాకుండా, ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. నిరుపేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అతి సమీపంలోనే గృహాలు నిర్మించేలా ఒక్కో నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని పనులు చేపడుతున్నట్లు తెలిపారు.లబ్ధిదారులపై ఏమాత్రం ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం రూ. 5 లక్షల సబ్సిడీని నేరుగా అందిస్తోందని మంత్రి తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రూ. 40 లక్షల నుంచి రూ. 60 లక్షల వరకు విలువ చేసే నాణ్యమైన ఫ్లాట్‌ను, లబ్ధిదారుడి వాటా కింద కేవలం రూ. 6 లక్షల స్వల్ప మొత్తానికే అందించనున్నారు. ఎస్ఆర్‌వో (SRO) బేసిక్ విలువ ప్రకారమే రూ. 14.6 లక్షల నుంచి రూ. 28.4 లక్షల వరకు విలువ చేసే ఈ భూమి, నిర్మాణ వ్యయంలో సింహభాగాన్ని ప్రభుత్వమే భరిస్తుండటంతో పేదలకు నామమాత్రపు ధరలోనే డబుల్ బెడ్‌రూమ్ తరహా ఇళ్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు.ఇందిరమ్మ టవర్స్ గృహాల కేటాయింపులో సమాజంలోని వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఇందులో భాగంగా పారదర్శకంగా ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5 శాతం, బీసీలకు 16 శాతం మరియు దివ్యాంగులకు 5 శాతం చొప్పున కేటాయించనున్నారు. మిగిలిన 50 శాతం గృహాలను జనరల్ కేటగిరీ పరిధిలోకి తెచ్చి, అర్హులైన నిరుపేద కుటుంబాలకు పారదర్శక పద్ధతిలో అందజేస్తామని మంత్రి పేర్కొన్నారు.మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ఇండ్ల కేటాయింపుల్లో మరో కీలక నిబంధనను పొందుపరిచింది. రిజర్వేషన్ కేటగిరీలలోని మొత్తం ఫ్లాట్లలో 30 శాతం గృహాలను తప్పనిసరిగా మహిళల పేరిటే కేటాయించనున్నారు. కుటుంబానికి ఆర్థిక మరియు సామాజిక భద్రత కల్పించడంలో మహిళల పాత్ర కీలకమైనందున, వారిపేరిట ఇండ్ల రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, దీనివల్ల వేలాది కుటుంబాల్లో మహిళలకు యాజమాన్య హక్కులు లభిస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునే అర్హులైన పౌరుల సౌకర్యార్థం ప్రభుత్వం డిజిటల్ విధానాలను అందుబాటులోకి తెచ్చింది. అర్హులు తమ సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చు. అంతేకాకుండా, మీసేవ ప్రత్యేక వాట్సాప్ నంబర్ 8096958096 కు సందేశం పంపడం ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ (`[http://meeseva.telangana.gov.in](http://meeseva.telangana.gov.in)`) ద్వారా కూడా ఇంట్లో నుంచే ఉచితంగా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అత్యంత సులభంగా, పారదర్శకంగా సాగుతుందని స్పష్టం చేశారు.నగర పరిధిలో తొలి విడతగా ఎంపిక చేసిన 16 ప్రధాన శాసనసభ నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను ముమ్మరం చేయనున్నారు. నగరాల్లోని మురికివాడలు, అద్దె ఇండ్లలో మగ్గుతున్న కుటుంబాలకు రక్షణతో కూడిన పక్కా గృహాలు కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు గణనీయంగా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అన్ని మౌలిక వసతులతో కూడిన మోడల్ కాలనీలుగా వీటిని తీర్చిదిద్దాలని అధికారులకు మంత్రుల బృందం ఆదేశాలు జారీ చేసింది.సమాజ సేవలో నిరంతరం శ్రమిస్తున్న దిగువ స్థాయి ఉద్యోగులకు ప్రభుత్వం ఈ పథకంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చింది. ప్రభుత్వ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, నాలుగో తరగతి (క్లాస్–4) ఉద్యోగులు మరియు నగర పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. నగర పరిశుభ్రతకు, పాలనా యంత్రాంగానికి వెన్నుముకగా నిలిచే ఈ శ్రమజీవులకు సొంతింటి కల నెరవేరేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై కార్మిక సంఘాలు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# మేఘాలయ హనీమూన్ హత్య కేసు

- సోనమ్‌కు సుప్రీంకోర్టులో షాక్
- బెయిల్ రద్దు.. మూడు వారాల్లో ట్రయల్ కోర్టులో లొంగిపోవాలని ఆదేశం
- హనీమూన్ హత్య కేసులో కీలక పరిణామం
- నిందితురాలు సోనమ్‌కు మంజూరైన బెయిల్‌ను రద్దు చేసిన సుప్రీంకోర్టు
- మూడు వారాల్లో ట్రయల్ కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశాలు

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్ రఘువంశీకి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆమెకు గతంలో మంజూరైన బెయిల్‌ను అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. మూడు వారాల్లోగా సంబంధిత ట్రయల్ కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశాలు జారీ చేసింది. నిందితురాలు సుదీర్ఘకాలం బెయిల్‌పై బయట ఉండటం వల్ల విచారణపై ప్రభావం పడే అవకాశం ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది.మధ్య ప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజా రఘువంశీ కుటుంబం ట్రాన్స్‌పోర్టు వ్యాపారం నిర్వహిస్తోంది. గతేడాది మే 11న రాజా రఘువంశీ, సోనమ్‌ల వివాహం జరిగింది. అనంతరం మే 20న హనీమూన్ కోసం ఈ నవదం పతులు మేఘాలయకు వెళ్లారు. అక్కడికి వెళ్లిన కొద్ది రోజులకే ఇద్దరూ అదృశ్యమవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.విస్తృతంగా గాలింపు చేపట్టిన పోలీసులు 11 రోజుల తర్వాత సోహ్రా సమీపంలోని ఓ జలపాతం వద్ద లోయలో రాజా రఘువంశీ మృతదేహాన్ని గుర్తించారు. అతడి శరీరంపై కత్తిపోట్లు ఉండటంతో ఇది హత్యేనని పోలీసులు నిర్ధారించారు. అనంతరం సోనమ్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టగా, ఆమె జూన్ 7న ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో ప్రత్యక్షమైంది.ప్రాథమిక దర్యాప్తులో సోనమ్ తన ప్రియుడు రాజ్ కుశ్వాహాతో కలిసి భర్త హత్యకు కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో సోనమ్‌తో పాటు ఆమె ప్రియుడు రాజ్ కుశ్వాహా సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో వారిలో పలువురికి బెయిల్ మంజూరైంది.ఈ ఏడాది ఏప్రిల్‌లో షిల్లాంగ్ కోర్టు సోనమ్‌కు బెయిల్ మంజూరు చేసింది. కేసు నమోదు సమయంలో పోలీసులు వర్తింపజేసిన చట్టపరమైన సెక్షన్లలో లోపాల కారణంగానే ఆమెకు బెయిల్ లభించిందనే వార్తలు వెలువడ్డాయి. అయితే, ఈ వాదనలను షిల్లాంగ్ కోర్టు అంగీకరించలేదు. సోనమ్‌ను నిర్బంధించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ బెయిల్‌ను సమర్థించింది. అనంతరం మేఘాలయ హైకోర్టు కూడా దిగువ కోర్టు తీర్పును నిలబెట్టింది.

# ఫీజు బకాయి – బీజేపీ లడాయి






- విద్యావ్యవస్థను కాంగ్రెస్ విధ్వంసం చేస్తోంది
- రూ .10 వేల కోట్ల బకాయిలతో విద్యార్థుల భవిష్యత్ గందరగోళం
- హామీలు ఇచ్చి నెరవేర్చని ప్రభుత్వం
- కాలేజీల మూతతో తీవ్ర ఇబ్బందులు
- కేంద్రం చర్చకు సిద్ధమున్నా కాంగ్రెస్ నాటకాలు

ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర విమర్శలు

**హైదరాబాద్ వెలుతురు జూలై 23:**

రైతు సంక్షేమాన్ని, విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, కేజీ నుంచి పేజీ వరకు రాష్ట్రంలో విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

### విద్యారంగంపై తీవ్ర ప్రభావం

ఫీజు బకాయిల ప్రభావం కేవలం విద్యార్థులపైనే కాకుండా, కళాశాలల్లో పనిచేస్తున్న వేలాది మంది అధ్యాపకులు, ఇతర సిబ్బందితో పాటు యాజమాన్యాలపైనా పడుతోందని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు ఫీజు రీయింబర్స్మెంట్ కొనసాగిస్తామని, పాత బకాయిలన్నీ చెల్లిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని నీరుగార్చడం దారుణమన్నారు. పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఈ పథకానికి నిధులు ఆపాలని ముఖ్యమంత్రికి ఎందుకు అనిపించిందో అర్థం కావడం లేదన్నారు.

### రూ.10 వేల కోట్లకు పైగా బకాయిలు

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ కింద సుమారు ₹10,000 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో మాత్రమే కాలేజీలు బంద్ అయ్యాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల కాలేజీలు మళ్లీ మూతపడే పరిస్థితి రావడం సిగ్గుచేటన్నారు. యాజమాన్యాలను చర్చలకు పిలిచి దశలవారీగా చెల్లిస్తామని హామీ ఇచ్చి, ఆ తర్వాత మాట దాటవేస్తున్నారని ఆరోపించారు. ఫీజులు అందక తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోందని, చివరకు పేద, రైతు కుటుంబాల పిల్లలకు కనీసం వసతి, భోజనం కూడా అందక అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

### కాంగ్రెస్ డ్రామాలు – రాజీనామా సవాల్

నీట్ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టంగా చెప్పినప్పటికీ, కాంగ్రెస్ నాయకులు సభలో చర్చకు సహకరించడం లేదని విమర్శించారు. ప్రధానమంత్రి నివాసం ముందు కాంగ్రెస్ నేతలు రాజకీయ నాటకాలు ఆడుతున్నారని, దేశంలో నేపాల్, బంగ్లాదేశ్ తరహా అరాచక వాతావరణం సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు అధికారంలో ఉన్న తెలంగాణ, కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో విద్యార్థులపై నిరంతరం లాఠీచార్జీలు, వాటర్ క్యానన్ల ప్రయోగం జరుగుతోందని దుయ్యబట్టారు. తెలంగాణలో అధికారంలో ఉన్న మంత్రులే స్వయంగా ధర్నాలు చేసి అరెస్ట్ కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ మంత్రులకు, ముఖ్యమంత్రికి నిజంగా ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే వెంటనే తమ పదవులకు రాజీనామా చేసి, ఆ తర్వాత ధర్నాలు చేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు.

# మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆశయాలకు ప్రతీకగా వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రం – మంత్రి పొన్నం ప్రభాకర్

**వంగర వెలుతురు జూలై 23:**



మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు స్వగ్రామమైన హనుమకొండ జిల్లా భీనదేవరపల్లి మండలం వంగరలో నిర్మాణంలో ఉన్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.ఈ సందర్భంగా విజ్ఞాన కేంద్రంలో కొనసాగుతున్న తుది దశ పనులను క్షుణ్ణంగా పరిశీలించిన మంత్రి, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.విజ్ఞాన కేంద్రంలోని ఫోటో గ్యాలరీ, సైన్స్ మ్యూజియం, అంఫీథియేటర్, ఆడిటోరియం, ధ్యాన మందిరం తదితర విభాగాలను మంత్రి పరిశీలించారు. ముఖ్యంగా ఫోటో గ్యాలరీలో పీవీ నరసింహారావు జీవిత విశేషాలు, ఆయన రాజకీయ ప్రస్థానం, దేశానికి చేసిన సేవలను ప్రతిబింబించే చిత్రాలు, అరుదైన జ్ఞాపకాలు, చారిత్రక అంశాల ప్రదర్శనపై పీవీ కుటుంబ సభ్యులతో చర్చించి పలు విలువైన సూచనలు చేశారు.దేశ రాజకీయ, ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన పీవీ నరసింహారావు గొప్ప వారసత్వాన్ని భావితరాలకు చేరవేసే విధంగా ఈ విజ్ఞాన కేంద్రాన్ని తీర్చిదిద్దాలని మంత్రి పేర్కొన్నారు.విజ్ఞాన కేంద్రం పరిసరాల్లో గార్డెన్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, విస్తృతంగా మొక్కలు నాటడంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో పీవీ నరసింహారావు కుమారులు ప్రభాకర్ రావు, రాజేశ్వర్ రావు, భీమదేవరపల్లి మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సీజేపీ నేతలతో చర్చలకు కేంద్రం సిద్ధం

- నీట్ లీకేజీపై ప్రభుత్వ దిద్దుబాటు
- చర్చలకు రావాలని కేంద్రం పిలుపు
- నాలుగు ప్రతిపాదనలపై భేటీకి సిద్ధం
- కన్నాట్ ప్లేస్‌లో దుకాణాలు బంద్
- విద్యార్థుల ఆందోళనపై బలప్రయోగ కుట్ర?
- కేంద్ర వైఖరిపై కేజ్రీవాల్ ఆందోళన

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

నీట్ పత్రాల లీకేజీ వ్యవహారంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉద్ధృతమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలను వేగవంతం చేసింది. సమస్య పరిష్కారమే లక్ష్యంగా విద్యార్థులు, 'కాక్రోచ్ జనతాపార్టీ' (సీజేపీ) నేతలను చర్చలకు రావాలని మరోసారి ఆహ్వానించింది.ఈ మేరకు బుధవారం కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ మాట్లాడుతూ— "మీకు అనుకూలమైన సమయంలో ఎప్పుడైనా ప్రభుత్వం తరఫున చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆందోళనకారులు తమ తరఫున ప్రతినిధులను పంపవచ్చు. కేంద్ర మంత్రి జేపీ నడ్డా కార్యాలయంలోగానీ, ఆయన నివాసంలోగానీ భేటీ అవుదాం" అని వెల్లడించారు. ప్రభుత్వం ఇప్పటికే పంపిన నాలుగు ప్రతిపాదనల పై ముందుగా చర్చలు ప్రారంభిస్తే, క్రమంగా సమస్యకు పరిష్కారం లభిస్తుందని, విద్యార్థుల సంక్షేమానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు.

### కన్నాట్ ప్లేస్‌లో వ్యాపారాలు బంద్

సీజేపీ ఆందోళనల తీవ్రత నేపథ్యంలో న్యూఢిల్లీ ట్రేడర్స్ అసోసియేషన్ (ఎన్‌డీటీఏ) కీలక నిర్ణయం తీసుకుంది. కన్నాట్ ప్లేస్ (సీపీ) ప్రాంతంలో గురువారం సాయంత్రం 6:30 గంటలకే దుకాణాలు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించింది.

### కేజ్రీవాల్ విమర్శలు

అయితే, ఈ నిర్ణయంపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు. సాయంత్రమే దుకాణాలు మూసివేయించడమే కాకుండా, జంతర్‌మంతర్ వద్ద భారీగా పోలీసులను మోహరించడం చూస్తుంటే.. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్రం మరోసారి బలప్రయోగం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

# విద్యార్థులపై దాడులకు మోదీ బాధ్యత వహించాలి

- ప్రధానిపై ఎంపీ ప్రియాంక గాంధీ
- నీట్ పేపర్ లీక్, చలో పార్లమెంట్ నిరసనలపై నిలదీసిన కాంగ్రెస్ ఎంపీ
- విద్యార్థులపై బాష్పవాయువు, లాఠీఛార్జ్ ఎందుకని ప్రశ్నించిన ఎంపీ
- విజయాలకు క్రెడిట్ తీసుకునే మోదీ..
- వైఫల్యాలకు కూడా బాధ్యత వహించాలని డిమాండ్
- పార్లమెంట్ బయట అధికారపక్ష ఎంపీల నిరసనలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్య
- ఆందోళన చేస్తున్న విద్యార్థులు ఉగ్రవాదులు కాదన్న ప్రియాంక గాంధీ
- విద్యార్థులపై ఇంటర్నెట్ నిలిపివేత, పోలీసు చర్యలను ఖండించిన నేత
- మోదీ హయాంలో 152 పేపర్ లీక్‌లు జరిగాయని ఆరోపణ

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**



నీట్ పేపర్ లీక్, 'చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ఆమె.. సోషల్ మీడియాలో విద్యార్థుల పట్ల ప్రేమను వ్యక్తం చేసే ప్రధాని, వాస్తవంలో వారిపై బాష్పవాయువు ప్రయోగించి లాఠీఛార్జ్ చేయించారని విమర్శించారు.అధికార పక్షానికి చెందిన ఎంపీలు పార్లమెంట్ బయటకు వచ్చి నిరసనలు చేపట్టడం ఎప్పుడైనా చూశామా అని ప్రియాంక ప్రశ్నించారు. పార్లమెంట్ సమయాన్ని అధికార పక్షమే వృథా చేస్తోందని ఆరోపించారు. దేశంలో నిజంగా ప్రజాస్వామ్యం కొనసాగుతోందా అనే సందేహం కలుగుతోందన్నారు.ఆందోళన చేస్తున్న విద్యార్థులను ఉగ్రవాదుల్లా చూడడం సరికాదని ప్రియాంక గాంధీ అన్నారు. నిరసనలు చేస్తున్న వారిపై బాష్పవాయువు ప్రయోగించడం, లాఠీలతో దాడి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనల సమయంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడాన్ని కూడా ఆమె తప్పుబట్టారు.ప్రధాని మోదీపై విమర్శలు కొనసాగించిన ప్రియాంక.. దేశం క్రీడల్లో పతకాలు సాధించినా, అంతరిక్ష విజయాలు నమోదైనా వాటి క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకుంటారని అన్నారు. అదే విధంగా ఆయన అధికారంలో ఉన్న సమయంలో జరిగిన వైఫల్యాలకు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.మోదీ హయాంలో దాదాపు 152 పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నాయని ప్రియాంక ఆరోపించారు. ఆ ఘటనలకు బాధ్యులెవరో కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కోరారు. ప్రస్తుతం విద్యార్థులపై జరుగుతున్న పోలీసు చర్యలకు కూడా ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అంశాలను రాజకీయాలకు బలిచేయకుండా, వారి సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రియాంక గాంధీ సూచించారు.

# ఢిల్లీలో రెండోరోజూ 16 మెట్రో స్టేషన్లు మూసివేత

- సీజేపీ ఆందోళనలతో నిర్ణయం
- సుప్రీంకోర్టుకు ఎస్సీబీఏ పిటిషన్..
- పార్లమెంట్‌లో కొనసాగిన వాయిదాల పర్వం
- కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలతో ప్రయాణికులకు ఇబ్బందులు
- వరుసగా రెండోరోజూ 16 మెట్రో స్టేషన్లను మూసివేసిన అధికారులు
- సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ పిటిషన్‌పై స్పందించిన సీజేఐ
- సమస్య కొనసాగితే జోక్యం చేసుకుంటామని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్య

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 2026:**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండోరోజు 16 మెట్రో స్టేషన్లను అధికారులు మూసివేశారు. భద్రతా కారణాల దృష్ట్యా తీసుకున్న ఈ నిర్ణయంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడటంతో కార్యాలయాలు, కోర్టులు, ప్రభుత్వ సంస్థలకు వెళ్లే వారి రాకపోకలు ప్రభావితమయ్యాయి.ఈ పరిణామాలపై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మెట్రో స్టేషన్ల మూసివేత కారణంగా న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు సిబ్బంది న్యాయస్థానానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై స్పందించిన సీజేఐ.. మధ్యాహ్నం వరకు పరిస్థితిని గమనిద్దామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే న్యాయస్థానం జోక్యం చేసుకుంటుందని తెలిపారు.మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్‌ను వరుసగా కుదిపేస్తోంది. ఈ అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విపక్ష సభ్యులు పట్టుబట్టడంతో గురువారం కూడా ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొంది. దాంతో లోక్‌సభ, రాజ్యసభలు పలుమార్లు వాయిదా పడ్డాయి.




“ఐక్యత మన బలం - హక్కుల కోసం మన పోరాటం”
పెద్ద అంబార్ పేట
ఇసుక లారీ ఓనర్స్
అసోసియేషన్
మన సంఘం
మన బలం
మన హక్కులకోసం
మన ఐక్యత
అసోసియేషన్ కార్యాలయ
ప్రారంభోత్సవం
పెద్ద అంబార్ పేట
ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్
మన అసోసియేషన్ నూతన కార్యాలయ
ప్రారంభోత్సవ మహోత్సవానికి
మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాము.
తేదీ
24/07/2026
(శుక్రవారం)
సమయం
ఉదయం
11:00
గంటలకు
అసోసియేషన్ సభ్యులు, లారీ యజమానులు,
డ్రైవర్లు మరియు మిత్రులు అందరూ
తప్పక హాజరుకావలసిందిగా
మనవి.
కార్యాలయ చిరునామా:
సూర్య వంశీ గార్డెన్ సిటీ కాలనీ,
పెద్ద అంబార్ పేట, హైదరాబాద్.
మీ రాక
మా కార్యక్రమానికి
శోభను తీసుకురానుంది...
ఇట్లు,
పెద్ద అంబార్ పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ కమిటీ





# ఓటరు సవరణ ప్రక్రియ లో ఎన్యుమరేషన్ ఫారాన్ని నింపి బి ఎల్ వో కి అందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా తన ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి బీఎల్‌వోకు అందజేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను సరిచూసుకొని ఎన్యూమరేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, హుస్నాబాద్ పట్టణంలో ఇప్పటి వరకు 80 శాతానికి పైగా ఓటరు సవరణ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి హుస్నాబాద్ నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలపాలని పార్టీ శ్రేణులకు సూచించారు.ఆగస్టు 3వ తేదీ SIR ప్రక్రియకు చివరి తేదీ కావడంతో, షిఫ్ట్ అయిన కుటుంబాల



వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని, వారు ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారో, ఏ ప్రాంతంలో ఓటు నమోదు చేసుకో వాలనుకుంటున్నారో తెలుసుకుని అవసరమైన సహకారం అందించాలని బిఎల్ఏలు, సూపర్వైజర్లకు ఆదేశించారు.అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా అత్యంత బాధ్యతతో పని చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి వార్డు సభ్యుడు తమ వార్డులో ఎన్యూమరేషన్ పూర్తి కాని కుటుంబాలను గుర్తించి, బిఎల్ఏలతో సమన్వయం చేసుకుంటూ ఇంటింటికీ వెళ్లి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు జాబితాలో ఉండేలా ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో SIR పీసీసీ కోఆర్డినేటర్ సౌజన్య గౌడ్,హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటరమణ, కౌన్సిలర్లు, బిఎల్ఏలు, బిఎల్ఏ సూపర్వైజర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


# కేంద్ర జలశక్తి మంత్రితో బీజేపీ ఎంపీల భేటీ

- కాళేశ్వరం, గోదావరి-కావేరి అనుసంధానంపై తీవ్ర చర్చ
- తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఢిల్లీలో చర్చలు

తెలంగాణ రాష్ట్రానికి చెందిన భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యుల బృందం గురువారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశాన్ని నిర్వహించింది. కేంద్ర మంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో తెలంగాణలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత పరిస్థితి మరియు పెండింగ్ అనుమతులపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రానికి సంబంధించిన జలవనరుల వివాదాలు, కేంద్ర ప్రభుత్వ సహకారంపై నేతలు మంత్రికి ప్రత్యేకంగా విజ్ఞప్తులు సమర్పించారు. కీలక సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో పాటు తెలంగాణకు చెందిన పలువురు ప్రముఖ బీజేపీ ఎంపీలు పాల్గొన్నారు. ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, కే.రఘునందన్ రావు,



ధర్మపురి అరవింద్, గోడెం నగేశ్, డీకే అరుణ మరియు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు తదితరులు ఈ బృందంలో ఉన్నారు. రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను కాపాడటానికి, నీటిపారుదల ప్రాజెక్టుల సమస్యలను వేగంగా పరిష్కరించడానికి కేంద్ర జలశక్తి శాఖ చొరవ తీసుకోవాలని ఈ సందర్భంగా నేతలు కోరారు.ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీలు, అందులోని లోపాలు మరియు నీటి నిల్వ అంశాల చుట్టూనే తీవ్రంగా భ్రమిస్తున్నాయి. ఒకవైపు ఎల్‌నినో పరిస్థితుల వల్ల నీటి కొరత తలెత్తే ముప్పు ఉండగా, మరోవైపు కాళేశ్వరం పిల్లర్ల కుంగుబాటు వ్యవహారం రచ్చకెక్కింది. ఇటువంటి క్లిష్ట సమయంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు అంతా కలిసి కేంద్ర జలవనరుల శాఖ మంత్రితో ప్రత్యేకంగా భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సమావేశం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంతో పాటు కేంద్రం వైఖరిని స్పష్టం చేసే యత్నం జరిగింది.కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై నేషనల్ డామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఈ బ్యారేజీల గేట్లను పూర్తిగా ఎత్తి ఉంచాలని ఎన్డీఎస్ఏ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, అందుకే ఎగువ నుంచి వచ్చే నీటిని నిల్వ ఉంచకుండా కిందకు వదిలేస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. భద్రతా పరమైన ప్రమాదాలు ఉన్నందున కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి గోదావరి నీటిని ఎత్తిపోసే ప్రసక్తే లేదని ప్రభుత్వం తమ నిర్ణయాన్ని గట్టిగా సమర్థించుకుంటోంది.కాళేశ్వరం పంపులు నడిపించి నీటిని నింపాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇదివరకే ఘాటుగా స్పందించారు. ఒకవేళ కన్నెపల్లి పంపులను ప్రారంభించి నీటిని ఎత్తిపోయాలని భావిస్తే, బీజేపీ నేతలే స్వయంగా చొరవ తీసుకుని కేంద్ర పరిధిలోని ఎన్డీఎస్ఏ నుంచి అవసరమైన అన్ని రకాల సాంకేతిక అనుమతులు తీసుకురావాలని సవాల్ విసిరారు.



1. "ఓటు అనేది వజ్రాయుధం...
దాన్ని అమ్మితే ఐదేళ్లు బానిసత్వం,
సద్వినియోగం చేస్తే ఐదేళ్లు సుస్థిర పాలన."

2. "ఓటు అనేది ప్రజాస్వామ్యానికి
వజ్రాయుధం...
ఒక్క ఓటు దేశ దిశను మార్చగలదు,
బాధ్యతతో వేసిన ఓటు భవిష్యత్తును
నిర్మిస్తుంది."

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com